జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాపాలన

NEWS IS RIGHT

Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*

https://prajapalana.com/epaper.php



చదవండి... చదివించండి... చందాదారులుగా చేరండి...
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాపాలన
న్యూస్ ఈజ్ రైట్
6-2-29/3/12, 3వ అంతస్థు, దౌలత్ ప్లాజా, లక్డీకాపూల్, హైదరాబాద్ - 004
వివరాలకు సంప్రదించండి : 8886022523



సంపుటి 15 సంచిక 40 విశాఖపట్నం సోమవారం 25 అక్టోబరు 2021 8 పేజీలు వెల : 5.00




## బద్వేలులో బీజేపీకి డిపాజిట్ కూడా రాదు: మంత్రి వెల్లంపల్లి

బద్వేలు(వైఎస్సార్ కడప) అక్టోబరు 24 ప్రజాపాలన ప్రతినిధి: : బద్వేలులో బీజేపీకి డిపాజిట్ కూడా రాదని మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ అన్నారు. బద్వేలు ఉపఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం వైఎస్సార్‌సీపీ అభ్యర్థి డాక్టర్ దాసరి సుధా తరపున ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారతీయ జనతా పార్టీకి ప్రజలని ఓట్లు అడిగే అర్హత లేదని అన్నారు. తమ ప్రభుత్వం ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అందించిందని అన్నారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి దాసరి సుధని భారీ మెజార్టీతో గెలిపించాని ప్రజలను కోరారు.

## ఒకేసారి 9 మెడికల్ కాలేజీలు..

# ప్రారంభించనున్న మోడీ

### 8 మెడికల్ కాలేజీలు పూర్తిగా కేంద్రం నిధులతో కట్టినవి



న్యూఢిల్లీ,అక్టోబరు 24 ప్రజాపాలన ప్రతినిధి: ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రంలో రేపు సోమవారం ఒకేసారి 9 మెడికల్ కాలేజీలను ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ప్రారంభించనున్నారు. ఘాజిపూర్, మీర్జాపూర్, జౌన్‌పూర్, సిద్ధార్థ్ నగర్, ఈటా, హార్దోయి, ప్రతిప్‌ఘడ్, ఫతేపూర్, డియోరియాలలో ఏర్పాటు చేసిన మెడికల్ కాలేజీలను ప్రారంభిస్తున్నారు. ఇందులో విశేషమేమిటంటే వీటిలో 8 కాలేజీలు కేంద్ర ప్రభుత్వం తన నిధులతో నిర్మించగా, రాష్ట్ర ప్రభుత్వం ఒక కాలేజీని మాత్రమే నిర్మించింది. కేంద్ర ప్రభుత్వం ఓ ప్రత్యేక పథకం కింద వెనుకబడిన జిల్లాల్లో ఈ మెడికల్ కాలేజీలను నిర్మించారు. ఈ మెడికల్ కాలేజీలతోపాటు తన నియోజకవర్గంలో ఏకంగా రూ. 5,200 కోట్ల నిధులతో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను కూడా రేపు ప్రధాన మంత్రి ప్రారంభించనున్నారు.

## హెల్త్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగ అవకాశాలు..

అమరావతి, అక్టోబరు 24 ప్రజాపాలన ప్రతినిధి: ఏపీ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఖాళీగా ఉన్న పోస్టులకు రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నోటిఫికేషన్ విడుదల చేసింది. వైఎస్సార్ విలేజ్, వార్డు క్లినిక్స్‌లో వైద్య సేవలు అందించడానికి 3,393 కాంటాక్ట్ పద్ధతిన మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్ పోస్టుల శనివారం నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ పోస్టులకు కేవలం ఆన్‌లైన్ ద్వారానే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఎటువంటి పరీక్ష లేకుండా కేవలం అకాడమిక్ మెరిట్ ద్వారానే అభ్యర్థులను ఎంపిక చేస్తారు. నోటిఫికేషన్, దరఖాస్తు విధానం తెలుసుకొనేందుక అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలి.

దరఖాస్తు చేసుకోవడానికి అర్హతలు:

దరఖాస్తు చేసుకొనే అభ్యర్థి ఏపీ నర్సింగ్ కౌన్సిల్ గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసి ఉండాలి. నోటిఫికేషన్ జారీ చేసిన తేదీ నాటికి జనరల్ కేటగిరీ అభ్యర్థులు 35 ఏళ్లలోపు (బీసీ, ఎస్సీ, ఎస్టీ, వికలాంగులు, ఎక్స్ సర్వీస్‌మెన్ 40 ఏళ్లలోపు) వయసు కలిగి ఉండాల్సి ఉంటుంది. దరఖాస్తుకు నవంబర్ 6, 2021 వరకు అవకాశం ఉంది.

ఎంపిక విధానం..

ముందుగాగా పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలి. బీఎస్సీ నర్సింగ్ మార్కులు ఆధారంగా ఎంపిక ఉంటుంది. రూల్ ఆఫ్ రిజర్వేషన్ల ప్రకారం పోస్టులు భర్తీ చేస్తారు. కాంట్రాక్టు విధానంలో నియామకాలు ఉంటాయి. ముందుగా ఏడాది పాటు కాంట్రాక్టు విధానంలో నియమిస్తారు. పనితీరు ఆధారంగా సర్వీసు కొనసాగించే అవకాశం ఉంటుంది.

# ఏపీ లొల్లి ఢిల్లీకి..

### ఇక అంతా హస్తినమే సవాల్.. ఒక్కసారిగా హైవోల్టేజ్



అమరావతి, అక్టోబరు 24 ప్రజాపాలన ప్రతినిధి: ఏపీలో క్రియేట్ చేసిన రచ్చ అంతా ఇంతా కాదు. వారం పాటు ఓ మినీ యుద్ధమే జరిగింది.! ధర్నాలు, దీక్షలు, నిరసనలు.. ఇలా రాజకీయం ఒక్కసారిగా హైవోల్టేజ్‌కి చేరింది. ఇప్పుడీ వార్ సీన్ ఢిల్లీకి షిఫ్ట్ అవుతోంది. సోమవారం టీడీపీ అధినేత చంద్రబాబు హస్తిన వెళ్లనున్నారు. మధ్యాహ్నం పన్నెండున్నరకి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను కలుస్తారు. టీడీపీ కార్యాలయాలపై దాడులు, డ్రగ్స్ వ్యవహారం, రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలపై కేంద్ర పెద్దలకు ఫిర్యాదు చేయనున్నారు చంద్రబాబు. ఇప్పటికే రాష్ట్రపతి, ప్రధాని, అమిత్ షా, గవర్నర్‌కు(మిగతా 2లో..)

## విశాఖలో క్రికెట్ బెట్టింగ్



విశాఖ సిటీ,అక్టోబరు 24 ప్రజాపాలన ప్రతినిధి: టీ20 ప్రపంచ కప్ టోర్నీ సందర్భంగా బెట్టింగ్ జరుగుతున్న కేంద్రంపై స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎన్‌ఈబీ) పోలీసులు దాడులు నిర్వహించి ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. నగదు, ల్యాప్‌టాప్, ఇతర వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. టీ20 ప్రపంచ కప్ క్రికెట్ టోర్నీలో భాగంగా ఆదివారం రాత్రి భారత్–పాకిస్థాన్‌ల మధ్య మ్యాచ్ నేపథ్యంలో భారీ బెట్టింగ్‌లకు ఏర్పాట్లు జరుగుతున్నట్టు ఆదివారం ఉదయం ఎస్‌ఈబీకి సమాచారం అందింది. ఎస్‌ఈబీ జాయింట్ డైరెక్టర్ సతీశ్‌కుమార్ ఆదేశాల మేరకు ఏఈఎస్ బి.శ్రీనాథుడు, సిబ్బందితో కలిసి మాధవధారలోని ఒక అపార్ట్‌మెంటులో దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న లాలం ప్రభాకర్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. రూ.88,088 నగదు, ల్యాప్‌టాప్, రెండ్ సెల్ ఫోన్లు, రెండు చెక్ బుక్‌లు, ఏటీఎం కార్డులను స్వాధీనం చేసుకున్నారు.

## చంద్రబాబుపై ఓ రేంజ్‌లో పంచ్‌లు పేల్చిన ఎమ్మెల్యే వల్లభనేని వంశీ.!



విజయవాడ, అక్టోబరు 24 ప్రజాపాలన ప్రతినిధి: ఏపీలో హైవోల్టేజ్ పాలిటిక్స్ కంటిన్యూ అవుతున్నాయి. నిన్నటి వరకు దీక్షలు, ధర్నాలు, నిరసనలు.! ఇప్పుడు మ్యాటర్ ట్విట్టర్‌కు చేరింది. ట్విట్టర్ వేదికగా చంద్రబాబుపై ఓ రేంజ్‌లో పంచ్‌లు పేల్చారు ఎమ్మెల్యే వల్లభనేని వంశీ.!చంద్రబాబు నిజమే. నేను విశ్వాసఘాతుకుడినే. అది నీ ఒక్కడికి మాత్రమే.. కానీ నువ్వు..ఇందిరాగాంధీ, ఎన్టీఆర్, హరికృష్ణ, మోడీ, అమిత్‌షా లాంటి పెద్దలకు నమ్మకద్రోహివి..వెన్నుపోటుదారుడివి అంటూ విమర్శించారు. అంతేకాదు..కాంగ్రెస్, టీడీపీ, బీజేపీ, కమ్యూనిస్ట్ పార్టీలు, జనసేన పార్టీలకు కూడా నమ్మకద్రోహివి అంటూ ట్వీట్ చేశారు.

## తిరోగమిస్తున్న నైరుతిరుతుపవనాలు..

### ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో వర్షాలు పడే అవకాశం..




అమరావతి, అక్టోబరు 24 ప్రజాపాలన ప్రతినిధి: ఈ అల్పపీడనానికి అనుసంధానంగా ఉపరితల ఆవర్తనం 5.8 కి.మీ ఎత్తున కొనసాగుతుంది. ఆంధ్రప్రదేశ్‌లో నైరుతి రుతుపవనాల తిరోగమనరేఖ కళింగపట్నం, నందిగామ, కర్నూలు, గదగ్ , మజలి ప్రాంతముల గుండా వెళుతుందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. ఈశాన్య గాలులు వీచే అవకాశం ఉన్నందువలన సుమారుగా రాగల 48 గంటలలో దేశం అంతట నుంచి నైరుతి రుతుపవనాలు తిరోగమించుకునే అవకాశాలు ఉన్నాయని తెలిపింది. అదే సమయంలో రాగల 48 గంటలలో ఈశాన్య రుతుపవనాలు భారతదేశంలోని ఆగ్నేయ ద్వీపకల్ప ప్రాంతంలో ప్రవేశించే అవకాశం ఉన్నట్లు వెల్లడించింది. ఉత్తర తమిళనాడు తీరం, దాని పరిసర ప్రాంతాల్లో 1.5 కి.మీ. ఎత్తులో ఉపరితల ఆవర్తనం ఏర్పడిందని పేర్కొంది. ఉపరితల ఆవర్తనం కారణంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉన్నట్లు తెలిపింది. ఉత్తర కోస్తా ఆంధ్ర, యానాంలో ఈరోజు, రేపు, ఎల్లుండి ఉరుములు, మెరుపులుతో పాటు తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు ఒకటి లేక రెండు చోట్ల కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. ఈరోజు దక్షిణ కోస్తాఆంధ్రాలో ఉరుములు, మెరుపులుతో పాటు తేలికపాటి నుంచి ఒక మోస్తరు వానలు పడే అవకాశం ఉంది. నెల్లూరు, ప్రకాశం జిల్లాలలో కొన్ని చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. రేపు, ఎల్లుండి దక్షిణ కోస్తాఆంధ్రాలో ఉరుములు, మెరుపులుతో పాటు తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు చెప్పింది. (మిగతా 2లో..)




# వెలుగులోకి వచ్చిన దేవాలయాలకు సంబంధించిన ఓ చీకటి కోణం

## రావి చెట్టు తొలగించిన స్థానంలో వివిధ వ్యాపారస్తుల ఆక్రమణలు

## ఆలయ విషయంలో అధికారుల నిర్వాకం పై ప్రజల్లో తీవ్ర ఆగ్రహావేశాలు

## ఆందోళన బాట పట్టనున్న పలు హిందూ సంఘాలు





విస్సన్నపేట, అక్టోబరు 24 ప్రజాపాలన ప్రతినిధి: విస్సన్నపేట బస్టాండ్ సమీపంలోని శ్రీ అభయఆంజనేయ స్వామి దేవస్థానం కు చెందిన భక్తులచే పూజలందుకునే రాయి చెట్టు ను ట్రాఫిక్కు అవంతరాలు అనే నెపంతోపోలీసులు తొలగించారు . అదేవిధంగా భక్తులు ఆలయ ప్రవేశానికి ముందు కాళ్ళు చేతులు శుభ్ర పరుసు కొనుట ఆనవాయితీ అలా ఏనాటి నుంచో వస్తున్న. కొట్టుడు పంపును ధ్వంసం చేయటం జరిగింది.అదే రావి చెట్టు కింద ఉన్న నందీశ్వరుడు విగ్రహం మరియు నాగ దేవత విగ్రహాలు పక్కకు తొలగించడం జరిగింది.ఇప్పటికే అక్కడ ఉన్న నాగుల విగ్రహాలు మాయమయ్యాయి.నందీశ్వరుడి విగ్రహం కూడా కొంత ధ్వంసం జరిగింది.దీని పట్ల గ్రామస్తులు తీవ్ర ఆందోళన వెలిబుచ్చారు హిందువుల మనోభావాలు కాలరాస్తూఇటువంటి చర్యలు చేపట్టడం పట్ల విసన్నపేట లో ప్రజలు మరియు హిందువులు తీవ్ర ఆగ్ర ఆవేశాలకు లోనవుతున్నారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి సకాలంలో చర్యలు తీసుకోవాలని హిందూ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.లేని పక్షంలో హిందూ సంఘాలను కలుపుకొని బిజెపి ఆధ్వర్యంలో ఆందోళనలు చేపట్టాల్సి వస్తుందని బిజెపి మజ్దూర్ సెల్ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు పెనుగొండ రామచంద్ర రావు అన్నారు.

# ప్రమాదాలకు నెలవుగా మారిన రహదారి మరమ్మతులు చేయించిన చాట్రాయి పోలీసులు



చాట్రాయి, అక్టోబరు 24 ప్రజాపాలన ప్రతినిధి :చాట్రాయి పోలీస్ స్టేషన్ పరిధిలోని జనర్ధనవరము గ్రామం నుండి, చాట్రాయి మధ్య గల నాలుగు కిలోమీటర్ల రహదారి కి ఇరువైపులా ఉన్న చెట్లు రోడ్డు మీదకి విస్తరించి ఉండటం వలన తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ,గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారని సమాచారం తిరువూరు సీఐ గారి దృష్టికి రాగా, వెంటనే సీఐ శేఖర్ బాబు గారు , చాట్రాయి ఎస్ఐ ప్రతాప్ రెడ్డి గారు, జెసిబి ఏర్పాటు చేసి, రహదారికి ఇరువైపులా ఏపుగా పెరిగిన ముళ్ళ పొదల ను తొలగించి రహదారి విశాలంగా మార్చారు.అంతేకాకుండా రోడ్డుకిరువైపులా కొత్త మొక్కలు నాటి నుంచి పచ్చదనాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని తెలిపారు. గ్రామస్తులు తమ సమస్య పై వెంటనే స్పందించిన సిఐ గారికి, ఎస్ఐ గారికి ప్రత్యేక అభినందనలు తెలుపుతూ, జిల్లా పోలీసు శాఖకు రుణపడి ఉంటామని తెలిపారు

# తిరోగమిస్తున్న నైరుతిరుతుపవనాలు..

(మొదటి పేజీ తరువాయి)

రాయలసీమలో ఉరుములు, మెరుపులుతో పాటు తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు చాలా ప్రాంతాల్లో కురిసే అవకాశం ఉందని పేర్కొంది. అనంతపురం, కడప, కర్నూలు జిల్లాల్లో అక్కడక్కడ భారీవర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. రేపు, ఎల్లుండి రాయలసీమలో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని అమరావత్ వాతావరణ కేంద్రం ప్రకటించింది.

# మైనర్లు ద్విచక్ర వాహనాలు నడిపితే సీజ్ చేస్తాం



నందిగామ,అక్టోబరు 24 ప్రజాపాలన ప్రతినిధి: నందిగామ గాంధీ సెంటర్ లో సీఐ కనకారావు తన సిబ్బందితో కలిసి ఆదివారం సాయంత్రం వాహనాల తనిఖీలు నిర్వహించారు ఈ సందర్భంగా సిఐ కనకారావు మాట్లాడుతూ కృష్ణా జిల్లా ఎస్పీ సిద్ధార్థ కౌశల్ ఆదేశాల మేరకు నందిగామ డిఎస్పీ నాగేశ్వర రెడ్డి సారథ్యంలో వాహనాల తనిఖీ నిర్వహించడం జరిగిందని తెలియజేశారు. ముఖ్యంగా యువతీయువకుల తల్లిదండ్రులు 18 సంవత్సరాల లోపు యువతకు వాహనాలు ఇచ్చే విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలియజేశారు. బయటికి వచ్చిన తరువాత తన స్నేహితులతో కలిసి త్రిబుల్ రైడ్ మరియు అతి వేగంగా వాహనాలు నడపడం జరుగుతుందని ఈ క్రమంలో వాహనం అదుపు తప్పి వీరికి గాని ఎదురుగా వచ్చే వారికి గానీ ప్రమాదం జరిగే అవకాశం ఉన్నందున దయచేసి తల్లిదండ్రులు ఈ విషయం గమనించాలని అన్నారు. బుల్లెట్ వాహనాలు ద్వారా శబ్ద కాలుష్యం పెరిగి ఇతరులకు ఇబ్బంది కలిగే విధంగా ఉంటుంది కాబట్టి వాహన కొనుగోలు దారులు ఈ విషయంపై దృష్టి సారించాలని అన్నారు.

# పోలీస్ వ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్న హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్



కావలి అక్టోబర్ 24 ప్రజాపాలన ప్రతినిధి : పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన మెట్టు పూరి చిరంజీవి రెడ్డి పోలీసు వ్యవస్థ కి పలువురు ప్రశంసలతో ముంచెత్తారు అయితే పోలీసు వ్యవస్థ కి తెచ్చే విధంగా నిందితులకు నేనున్నానంటూ భరోసా ఇవ్వడంపై సర్వత్రా విమర్శలు నెలకొన్నాయి. వివరాల్లోకెళ్తే ఉదయగిరి నియోజకవర్గం కొండాపురం మండలం రామంజి పురంలో మైనర్ బాలిక సంఘటనలో నిందితులకు రాష్ట్ర పోలీస్ ఇన్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ చిరంజీవి రెడ్డి చక్రం తిప్పారని వార్త దళిత బడుగు బలహీన వర్గాలలో ఆగ్రహం రగిలిస్తుంది తొలుత నిందితులకు మద్దతుగా ఎమ్మెల్యే చంద్రశేఖర్ రెడ్డి ఉన్నారన్న ప్రచారం నెలకొంది .అయితే ఆయనకు పలువురు మహిళా సంఘాలు ఫోన్ కలిసినప్పుడు ఆయన తన ప్రమేయం ఏమీ లేదని దేవుడి మీద ప్రమాణం చేసి చెప్తానని నిందితులు ఎవరైనా ఎంత కఠినంగా అయినా శిక్షించు కోవచ్చని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో కేసు పక్కదోవ పట్టించేందుకు నిందితులను రక్షించేందుకు ఎవరు తెర వెనుక సూత్రధారి అన్న విషయం పై జరిగిన పరిశోధనలో చిరంజీవి రెడ్డి పేరు రావడం పలువురుని షాక్ కు గురి చేసింది. 13 సంవత్సరాల అమాయక పసిబిడ్డ దారుణంగా మానవ మృగాల హింసించ బడిన సంఘటనలో ఆయన ఇలా వ్యవహరించడం అమానుషంగా భావిస్తున్నారు. కనీసం పసిబిడ్డ పడిన బాధ నైనా గుర్తించకుండా భవిష్యత్ రాజకీయ పదవుల కోసం వర్గ బలం కోసం చిరంజీవి రెడ్డి తీసుకున్న నిర్ణయం జిల్లా వ్యాప్తంగా మహిళా సంఘాల లో దళిత వర్గాల లో ఆగ్రహానికి గురి చేసినట్టు సమాచారం సంఘటనలో ఇప్పటికే పలు ప్రజా సంఘాలు తమ వంతు బాలికకు న్యాయం చేయాలని నడుం బిగిస్తే ఏసీ గదుల్లో కూర్చుని చిరంజీవి రెడ్డి, పోలీస్ అధికారులు రాజకీయ నాయకులు మౌనవ్రతం చేస్తున్నారంటూ ప్రజలు ఆగ్రహిస్తున్నారా రు అ అధికారులు రాజకీయ నాయకులు బాలికకు అండగా ఉండి నిందితులను కఠినంగా శిక్షించాలని ప్రజలు కోరుకోవడం విశేషం.

# బి ఎస్ పి రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశం



విజయవాడ ప్రజాపాలన ప్రతినిధి : బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు బి.పరంజ్యోతి అధ్యక్షతన రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశం ఈ రోజు విజయవాడ, హనుమాన్ పేట లోని మారుతి ఫంక్షన్ హాలులో ఉదయం 10 గం.కు జరిగింది. సమావేశంలో రాష్ట్రంలో అన్ని జిల్లాల మరియు అన్ని నియోజకవర్గాల నాయకులు దాదాపు 300 మంది పాల్గొన్నారు.రాష్ట్ర అధ్యక్షులు బి.పరంజ్యోతి మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి పాలన అవినీతి మయంగా మారిందని, రాష్టాన్ని అప్పులు మయంగా మార్చారని,ఆయన ధ్వజమెత్తారు.రాష్టంలో అధికార ,మరియు ప్రతిపక్ష పార్టీలు ప్రజా సమస్యలు పట్టించుకోకుండా ,నీచమైన భాషతో ఒకరి నొకరు దూషించుకుంటూ ప్రజాస్వామ్య విలువలను దిగజారుస్తున్నారనీ ఈ రెండు పార్టీలకు రానున్న ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని ఆయన కోరారు. అలాగే అన్ని గ్రామాల్లో ఇంటింటికి బి.ఎస్. పి కార్యక్రమం



విజయవంతంగా పూర్తి చేయాలని నాయకులకు ఆదేశించారు. ముఖ్య అతిథి గా పాల్గొన్న రాష్ట్ర కో ఆర్డినేటర్ శ్రీ యం.బాలయ్య మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం బి సి జనగణన చేపట్టక పోవడంతో బి సి లకు తీరని అన్యాయం జరుగుతుందని,వెంటనే బి సి జనగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు విపరీతంగా పెరగడంతో పేద, మధ్య తరగతి ప్రజల జీవనం దుర్భరంగా మారిందని అన్నారు. కనుక, సంక్షేమ కార్యక్రామాలు ప్రతి ఒక్కరికీ చేరాలన్నా,పేద ప్రజల సమస్యలు పూర్తిగా పరిష్కరించబడాలన్నా బి.ఎస్. పి ని అధికారంలోకి తీసుకురావాలని , అందుకోసం నాయకులందరూ కృషి చేయాలని కోరారు. అనంతరం విజయవాడ ప్రెస్ క్లబ్ దగ్గర ఉన్న బహుజనసమాజ్ పార్టీ రాష్ట్ర కార్యాలయాన్ని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ న్యాయమూర్తి గురప్ప రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.కార్యక్రమంలో రాష్ట్ర కో ఆర్డినేటర్ లు శ్రీ ఆర్ . జె. మల్లికల్, గడ్డం.సంపదరావు, చిత్రసేన్, రాష్ట్ర ఉపాధ్యక్షులు బందెల గౌతమ్ కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు కె.కె.ప్రసాద్ బాబు, బి.పుష్పరాజు, కె.తిరుపతిరావు, కోశాధికారి కె.ప్రసాద్ తదితరులు పాల్గొని మాట్లాడారు.

# ఏపీ లొల్లి ఢిల్లీకి..

(మొదటి పేజీ తరువాయి)

లేఖలు రాశారు . రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ ఫెయిలైందని.. రాష్ట్రపతి పాలన పెట్టాలని డిమాండ్ చేస్తోంది టీడీపీ. అలాగే టీడీపీ ఆఫీస్‌పై దాడిని ఘటనపై %జదీ×% విచారణ జరిపించాలని కోరుతోంది. రాష్ట్రపతికి కూడా ఇవే అంశాలపై ఫిర్యాదు చేయానున్నారు. అటు రెండు రోజుల పాటు హస్తినలోనే మకాం వేయనున్నారు చంద్రబాబు. ప్రధాని నరేంద్ర మోదీ, అమిత్ షా అపాయింట్ మెంట్స్ కోసం కూడా ప్రయత్నిస్తున్నారు. వీలైతే మరి కొందరు కేంద్ర పెద్దలను కలవాలని భావిస్తున్నారు.అచ్చెన్నాయుడు, యనమల, కేశినేని నాని, పయ్యావుల కేశవ్, నక్కా ఆనంద్ బాబు, వర్ల రామయ్య, షరీఫ్, కాల్వ శ్రీనివాసులు, అనిత, రామానాయుడుతోపాటు మరికొందరు నేతలు కూడా ఢిల్లీ వెళ్లనున్నారు. చంద్రబాబు అండ్ టీమ్‌కు ప్రధాని, అమిత్‌షా అపాయింట్‌మెంట్ దొరుకుతుందా.. ఫిర్యాదులపై ఎలా స్పందిస్తారు అన్నది ఇంట్రెస్టింగ్‌గా మారింది.

# ఒకేసారి 9 మెడికల్ కాలేజీలు.. ప్రారంభించనున్న మోడీ

(మొదటి పేజీ తరువాయి)

త్వరలో ఎన్నికలు జరగనున్న ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రంలో అభివృద్ధి పనులను ప్రధాని మోడీ ప్రారంభించనుండడం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. కరోనా నేపథ్యంలో ఉత్తర్ ప్రదేశ్ సహా మొత్తం 10 రాష్ట్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టి 17,788 గ్రామీణ ఆస్పత్రుల్లో, 11,024 పట్టణ ఆస్పత్రుల్లో వసతులు, సిబ్బంది నియామకానికి అవకాశాలు కల్పించింది.

# వలస జీవులు విలవిల

శ్రీనగర్‌లో అక్టోబర్ 5న ఐదుగురు వలస కార్మికులు, ఒక కాశ్మీరీ పండిట్‌తో సహా 11 మంది పౌరులను భద్రతా బలగాలు కాల్చి చంపేయడంతో జమ్ము కాశ్మీర్ అంతటా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అక్టోబర్ నెలలోనే 20 మందికిపైగా సామాన్య పౌరులు భద్రతా దళాలకు బలయ్యారు. ఉగ్రవాదుల హింసకు వీధి వర్తకులతోసహా అనేకమంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారు. 2019 ఆగస్టు 5న ఆర్టికల్ 35ఎ, 370 రద్దు చేసినప్పటినుండి కాశ్మీరీలు అభద్రతా భావంలోనే మగ్గుతుండగా తాజా కాల్పులతో వలస జీవులు తమ మనుగడకు ముప్పు ఏర్పడిందని భీతావహులవుతున్నారు. వారేమైపోతారోనని తమ స్వగ్రామాల్లోని కుటుంబ సభ్యులు, బంధు మిత్రులు సైతం భయపడుతున్న పరిస్థితి. ఎక్కడో బీహార్ నుండి పొట్ట చేతబట్టుకొని కాశ్మీరానికి వచ్చి వడ్రంగం, వ్యవసాయం, తాపీ పని వంటివి చేస్తూ జీవనం సాగిస్తున్న బడుగు జీవుల ప్రాణాలను భద్రతా దళాలు హరించడం బాధాకరం. ఏటా కాశ్మీరానికి ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ మొదలు బీహార్ వరకు అనేక రాష్ట్రాలనుండి వివిధ పనులు చేయడానికి లక్షలాది మంది మార్చిలో వచ్చి నవంబర్ చివర్లో వెళ్లిపోతుంటారు. జమ్ము కాశ్మీర్‌లో స్కిల్డ్, సెమి స్కిల్డ్ పనివారిలో 80 శాతం మంది స్థానికేతరులేనని ఓ అంచనా. తాజాగా భయానక పరిస్థితులు నెలకొనడంతో వలస జీవులంతా తమ స్వగ్రామాల బాట పట్టక తప్పలేదు. దాంతో కాశ్మీరాన సంక్షోభం ఏర్పడుతుందని భయపడ్డ అధికార యంత్రాంగం వలస కార్మికుల్ని వారి స్వరాష్ట్రాలకు పోనివ్వకుండా రైల్వే స్టేషన్లు, బస్ స్టేషన్ల సమీపంలోని ఫంక్షన్ హాళ్లు, ప్రభుత్వ విద్యా సంస్థల్లో శిబిరాలకు మళ్లించడంతో బిక్కుబిక్కుమంటున్నారు. గడచిన 15–20 ఏళ్ల నుండి ఇక్కడకు వస్తున్నామనీ, ఏనాడూ ఇలాంటి అనుభవం ఎదురు కాలేదంటున్న వలస జీవుల వెతలు హృదయ విదారకం.దేశంలో ఒక రాష్ట్ర కార్మికులు మరో రాష్ట్రంలో సుమారు ఆరు కోట్లమంది పని చేస్తున్నారని కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సర్వే (2016–17) పేర్కొంది. దేశంలో 45.6 కోట్లమంది అంటే 40 శాతం ప్రజలు వలసలు పోయి జీవిస్తున్నారని 2011జనాభా లెక్కల ప్రకారం తేలింది. కాబట్టి శ్రమజీవి ఏ రాష్ట్రం వాడు ఏ ప్రాంతం వాడు అన్న దానితో నిమిత్తం లేదు. శ్రమ, ఉత్పత్తి ముఖ్యం. అవి ఉంటేనే మిగతావన్నీనూ. కాబట్టి భారతీయులెవరైనా దేశంలో ఎక్కడికైనా స్వేచ్ఛగా వెళ్లగలగాలి, తమకు చేతనైన పని చేసుకొని జీవనం సాగించే హక్కుండాలి. అయితే, స్థిరాస్తుల విషయంలో స్థానికులకు భారత రాజ్యాంగం, ఆయా రాష్ట్ర చట్టాలు కల్పించిన రక్షణలకు విఘాతం కలిగించరాదు. అటువంటి పరిస్థితులను కల్పించడం కేంద్ర ప్రభుత్వంతోపాటు ఆయా రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యత.కొద్దిమంది అసాంఘిక వ్యక్తులను గుర్తించి తగు చర్యలు చేపట్టడం మాని మూకుమ్మడిగా ప్రజలందరినీ ఇబ్బందుల పాల్జేయడం ప్రభుత్వానికి తగని పని. శాంతి భద్రతలు అదుపులోనే ఉన్నాయని, విద్రోహ శక్తులను అణచివేస్తామంటూ ఉన్నతాధికారులు హడావుడిగా 700 మందిని అనుమానితుల పేరిట నిర్బంధించారు.

# వేడి పెంచే లాబీ క్రీ(నీ)డలా?

వాతావరణ మార్పులకు కారణమౌతున్న భూతాపోన్నతి నియంత్రించే లక్ష్యసాధనలో బాధ్యత కలిగిన దేశాలు వెనుకంజలో ఉన్నాయి. ముఖ్యంగా పెట్రోలియం, బొగ్గు, సహజవాయువు వంటి శిలాజ ఇంధనాల వినియోగం నుంచి సౌర, పవన విద్యుత్తు వంటి పునర్వినియోగ ఇంధనాల (ఆర్ఈ) వైపు మళ్లే మార్పు లక్ష్యించిన స్థాయిలో లేదు. పైగా శిలాజ ఇంధన ఉత్పత్తివినియోగం పెరిగి, పరిస్థితి విషమిస్తోంది. మూన్నాలుగు రోజులుగా శిలాజ ఇంధన ఉత్పత్తిపై భారత్‌లో జరుగుతున్న పరిణామాలూ ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ ఇంధనాల వల్లే కర్బన ఉద్గారాలు పెరిగి, భూమి అసాధారణంగా వేడెక్కుతోంది.శతాబ్ది అంతానికి 2 డిగ్రీల సెల్సియస్‌ను మించి భూతాపోన్నతి పెరక్కుండా నిలువరించటంలో వీటి నియంత్రణే కీలకం. 2030 నాటికి 1.5 డిగ్రీల మించి పెరుగనీయవద్దన్నది లక్ష్యం. ఇప్పటికే 1.1 డిగ్రీల పెరిగింది. ఈ విషయంలో 'పారిస్ ఒప్పంద' లక్ష్యాలే ఫలితమిచ్చేలా లేవని, వాటిని సవరించి మరింత కటువుగా కొత్త లక్ష్యాలు ఏర్పరచుకోవాల్సిన అవసరముందని వాతావరణ మార్పులపై ఐక్యరాజ్యసమితి నియమించిన 'అంతర్ ప్రభుత్వాల వేదిక' (ఐపీసీసీ) నివేదించింది. వాస్తవంలో, గడువు లోపల పాత లక్ష్యాలు సాధించడం కూడా ఇపుడు దుస్సాధ్యంగా కనిపిస్తోంది.'దేశీయంగా ఖరారైన మా కట్టుబాట్లివి' (ఎన్‌డీసీ) అని, ఎవరికి వారిచ్చిన హామీలు సాధించే శ్రద్ధ కూడా ఆయా ముఖ్య దేశాల్లో లోపించింది! ఒప్పందం ప్రకారం జరగాల్సిన కార్యప్రణాళిక రచనలో, వేగంగా అమలు పరచడంలో భారత్‌తో పాటు శిలాజ ఇంధనాల ఉత్పత్తివినియోగం అధికంగా ఉన్న దేశాలు విఫలమైనట్టు ఐక్యరాజ్యసమితి పర్యావరణ కార్యక్రమపు(యుఎన్ఈపీ) తాజా నివేదిక చెప్పింది. కీలకాంశాలు బయటకొచ్చిన తర్వాత గురు వారం అధికారికంగానే వెల్లడైన నివేదిక విషయాలు పర్యావరణ హితైషులకు ఆందోళన కలిగి స్తున్నాయి.75 శాతం ప్రపంచ శిలాజ ఇంధనాల్ని ఆస్ట్రేలియా, బ్రెజిల్, కెనడా, చైనా, జర్మనీ, భారత్, ఇండొనేషియా, ఖజకిస్తాన్, మెక్సికో, నార్వే, రష్యా, సౌదీ అరేబియా, యుఏఈ, యుకె, అమెరికాలే ఉత్పత్తి చేస్తాయి. 'హామీ ఇచ్చినట్టు తగ్గించక పోగా... వారి ఇంధనఉత్పత్తి ప్రణాళికల సరళి చూస్తుంటే... 2030 నాటికి 110 శాతం, 2040 నాటికి 190 శాతం అధికంగా శిలాజ ఇంధ నాల్ని ఉత్పత్తి చేసే పరిస్థితిని అంచనా వేస్తున్నాం' అని నివేదిక చెప్పింది. భాగస్వాముల సదస్సు (కాప్–26) వచ్చే వారమే గ్లాస్‌గో (స్కాట్లాండ్)లో మొదలుకానున్న తరుణంలో ఇది చికాకు కలిగించేదే!భారత్‌లో పరిణామాలూ ఏమంత బాగోలేవు! ఇటీవలి బొగ్గు సంక్షోభం, విద్యుత్తు ఇతర పారిశ్రామిక అవసరాలకు బొగ్గు పెంచుకునే చర్యలుసన్నాహాల్ని చూస్తూనే ఉన్నాం. 'ఆత్మనిర్భర్ భారత్'లో భాగంగా బొగ్గు తవ్వకాల్ని పెంచే మౌలిక సదుపాయాల కోసం కేంద్రం యాభై వేల కోట్లు వెచ్చించనుంది. 2019–2024 మధ్య బొగ్గు ఉత్పత్తిని సుమారు 60 శాతం (730 నుంచి 1,149 టన్నులకు) పెంచే ప్రణాళికలు అమలవుతున్నాయి. భూసేకరణ అవాంతరాల్ని తొలగించే వ్యూహమూ ఇందులో భాగమే! ఇదే కాలానికి.. చమురు, సహజవాయు ఉత్పత్తి 40 శాతం పెంచా లన్నది లక్ష్యమట.లైసెన్సుల సరళీకరణ, గుర్తించిన వనరు నిక్షేపాలను సంపదగా మార్చడం, సహజవాయు రవాణా సంస్కరణల ద్వారా భారీ లక్ష్యాలు సాధించాలని యోచన! ఉత్పత్తి మౌలిక రంగంలోనో, పన్ను రాయితీల్లోనో పన్నెండు వేల కోట్లు వెచ్చించాలన్నది నిర్ణయం. పెట్రో ఉత్పత్తి పెంచి, ధరల్ని హేతుబద్ధం చేయాలని 'పెట్రో ఎగుమతి దేశాల సంస్థ (ఒపెక్)'ను భారత్ కోరింది. మరోవైపు ప్రపంచ చమురు కంపెనీల సీఈవోలతో మన ప్రధాని మోదీ సమావేశమై... దేశీయంగా చమురు, సహజవాయు ఉత్పత్తిని గణనీయంగా పెంచే ప్రణాళికలివ్వాలని కోరారు. చమురు దిగుమతుల భారం, విదేశీమారకం తరుగుదల తమకు కష్టంగా ఉంటోందని ఆందోళన వ్యక్తం చేశారు.

ప్రజాపాలన

సంపాదకీయం

సోమవారం 25, అక్టోబరు 2021

# రికార్డు స్థాయిలో రాజీనామాలు, సమ్మెలు

అమెరికా వ్యాప్తంగా ఇటీవలి మాసాల్లో వేలాదిమంది తమ ఉద్యోగాలను వీడుతున్నారు. పని పరిస్థితులను మెరుగుపరచాలని, వేతనాలు పెంచాలని కోరుతూ సమ్మె బాట పడుతున్నారు. పెద్ద సంఖ్యలో ప్రజలు మూకుమ్మడిగా రాజీనామాలు చేయడం వెనుక కార్మికుల్లో పెరుగుతున్న అసంతృప్తి ప్రతిబింబిస్తున్నది. గత నెల 14న లూసియానాలో వాల్‌మార్ట్‌లో పనిచేస్తున్న బెత్ మెక్‌గ్రాత్ అనే మహిళ ఫేస్‌బుక్‌లో ఒక సెల్ఫీ వీడియో పోస్ట్ చేసింది. ''ఇక్కడ పనిచేసే ప్రతి ఒక్కరూ అధికంగా పనిచేయాల్సి వస్తోంది, తక్కువగా వేతనాలు చెల్లిస్తున్నారు.' అంటూ మొదలెట్టిన ఆమె తన ప్రసంగంలో చాలా విషయాలు పంచుకున్నారు. 'మాతో మాట్లాడుతున్న రీతిలో మీరు మీ కుటుంబ సభ్యులతో మాట్లాడరనుకుంటున్నా' అని ఆమె వ్యాఖ్యానించారు. ఈ జాబ్ నాకు అక్కర్లేదు అంటూ ఆమె తెగేసి చెప్పారు. ఏడాది క్రితం టెక్సాస్‌కి చెందిన షానా రాగ్లాండ్ అనే మహిళ కూడా ఇదే రీతిలో వాల్‌మార్ట్ స్టోర్ ఇంటర్‌కంలో తన రాజీనామాను ప్రకటించారు. ఈ యువ మహిళల రాజీనామాలు వైరల్ కావడంతో అమెరికా కార్మికుల్లో నెలకొన్న అసహనం, అసంతృప్తి ఏ స్థాయిలో వున్నాయో అర్థమవుతోంది. రాజీనామాలు చేసే వారిలో మహిళలే ఎక్కువగా వుంటున్నారు. ఇలా మూకుమ్మడిగా రాజీనామాలు చేయడాన్ని గ్రేట్ రిజిగేషన్‌గా ఆర్థికవేత్తలు అభివర్ణిస్తున్నారు. తాజాగా బ్యూరో ఆఫ్ లేబర్ స్టాటిస్టిక్స్ విడుదల చేసిన నివేదిక పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ఆగస్టు మాసంలో రికార్డు స్థాయిలో 2.9 శాతం మంది కార్మికులు అంటే 43 లక్షల మంది తమ ఉద్యోగాలను వీడారు. ఉద్యోగాలు చాలా ఎక్కువగా వున్న సమయంలో ఈ స్థాయిలో రాజీనామాలు చోటు చేసుకున్నట్లైతే ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందుతోందనడానికి సంకేతంగా చూడవచ్చు. కార్మికులు మెరుగైన వేతనం పొందడానికి చేసే యత్నంగా భావించవచ్చు. ఉద్యోగ అవకాశాలు క్షీణించాయని నివేదికలు పేర్కొంటున్న తరుణంలో ఇలా జరగడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. అమెరికా కార్మికుల్లో సగానికి పైగా తమ ఉద్యోగాలను వీడి వెళ్లాలనుకుంటున్నారని హారిస్ పోల్‌లో వెల్లడైంది. యజమానులు ఏ విధమైన సంరక్షణ చర్యలు చేపట్టకపోవడం వల్లే తాము ఉద్యోగాలు వీడాల్సి వస్తోందని వారు చెబుతున్నారు. ఈ అంశాన్ని, రాజీనామాలను పక్క పక్కనబెట్టి చూడాల్సి వుంటుంది. కార్మికుల బేరసారాల శక్తిని దెబ్బతీసేందుకు దశాబ్దాల తరబడి కార్పొరేట్ల నేతృత్వంలో సాగిన కుతంత్రాల ఫలితంగా అమెరికాలో యూనియన్ల ప్రాతినిధ్యం చాలా తక్కువనే చెప్పాలి. ఈనాడు కేవలం 12 శాతం మంది కార్మికులు మాత్రమే యూనియన్లలో వున్నారు. మరింతమంది కార్మికులు సంఘాల నుండి బయటకు వచ్చినట్లైతే జరిగే సమ్మెలు, సమ్మె చేసే కార్మికుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం వుంది. కార్మికుల్లో కనిపిస్తున్న ఈ ధోరణిని 'ఒక రకమైన కార్మిక విప్లవం'గా ఫోర్బ్స్ డాట్ కామ్ సీనియర్ కంట్రిబ్యూటర్ జాక్ కెల్లీ వ్యాఖ్యానించారు. చెడ్డవారైన బాస్‌లపై, వేతనాలు పెంచాలన్న కార్మికుల మాటే వినిపించుకోని కంపెనీల తిరుగుబాటుగా అభివర్ణించారు. 'క్విట్ మై జాబ్ పోస్ట్' ట్రెండింగ్‌లో వుండడాన్ని, మెక్‌గ్రాత్, రాగ్లాండ్ వంటి మహిళా కార్మికులు చేసిన వీడియోలు వైరల్ కావడాన్ని ప్రస్తావిస్తూ ఆయన, మేనేజర్ల పెత్తనాన్ని ఇక ఎంత మాత్రమూ సహించేది లేదన్నారు. ఇదే సమయంలో సమ్మె చేయడానికి యూనియన్ సభ్యుల్లో పెరుగుతున్న విముఖతను చాలామంది ఆర్థికవేత్తలు విస్మరిస్తున్నారు. ఈ అంశాన్ని, రాజీనామాలను పక్క పక్కనబెట్టి చూడాల్సి వుంటుంది. కార్మికుల బేరసారాల శక్తిని దెబ్బతీసేందుకు దశాబ్దాల తరబడి కార్పొరేట్ల నేతృత్వంలో సాగిన కుతంత్రాల ఫలితంగా అమెరికాలో యూనియన్ల ప్రాతినిధ్యం చాలా తక్కువనే చెప్పాలి. ఈనాడు కేవలం 12 శాతం మంది కార్మికులు మాత్రమే యూనియన్లలో వున్నారు. మరింతమంది కార్మికులు సంఘాల నుండి బయటకు వచ్చినట్లైతే జరిగే సమ్మెలు, సమ్మె చేసే కార్మికుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం వుంది. మెక్‌గ్రాత్, రాగ్లాండ్ వంటి యూనియన్లలో లేని కార్మికులు వ్యక్తిగతంగా రాజీనామాలకు పాల్పడే బదులు సహచరులైన కార్మికులను సంఘటితం చేసి వుండవచ్చు. కార్మికుల్లో పెరుగుతున్న అసంతృప్తిని పేర్కొంటూ సోషల్ మీడియా పోస్టులు వైరల్ అవుతున్నాయి. మూకుమ్మడి రాజీనామాలను, దశాబ్దాల తరబడి అమెరికాలో పాతుకుపోయిన పని సంస్కృతి పట్ల తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్న కార్మికులతో కలిపి చూడాల్సి వుంటుంది. విధానాల రూపకల్పనపై కార్పొరేట్ అమెరికాకు చాలా గట్టి పట్టు వుంది. తనకు వచ్చే లాభాలను ప్రభుత్వాన్ని లాబీయింగ్ చేయడానికి ఖర్చు పెడుతుంది. కార్మికుల హక్కులను పణంగా పెట్టి మరిన్ని లాభాలు జుర్రుకోడానికి ప్రయత్నిస్తోంది. అదే సమయంలో, యూనియన్ల శక్తి సామర్థ్యాలు క్షీణిస్తున్నాయి. పెరుగుతున్న ఆర్థిక అసమానతలతో లింక్ చేసినప్పుడే ఇది అర్థమవుతుంది. కార్మికులు తమ శక్తిని పెంచుకోవడానికి యత్నిస్తుండడంతో కార్పొరేట్ అమెరికా తీవ్ర కలవరం చెందుతోంది.

# లఖింపూర్ - మానవ గౌరవానికే సవాల్

ఉన్నావో నుంచి హత్రాస్ వరకు జరిగిన అనేక ఇతర సంఘటనలతో పాటు లఖింపూర్ ఘటన...ఉత్తరప్రదేశ్‌లో నేరాల రేటు పెరుగుతున్నదని రుజువు చేసింది. అంతేకాక, అలాంటి సంఘటనల పట్ల పాలనా వ్యవస్థ తీరును కూడా బట్టబయలు చేసింది. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో నివేదిక ప్రకారం, 2020లో ఉత్తరప్రదేశ్‌లో అత్యధిక హత్య కేసులు (3779) నమోదయ్యాయి. ఇక్కడ చట్టం అమలు ప్రక్రియ తరచుగా వెనుక సీటులోనే ఉంటోంది. లఖింపూర్ ఘటనలో నేరారోపణలు ఎదుర్కొంటున్న నిందితులను నిర్బంధంలోకి తీసుకునేందుకు కూడా ఉన్నత న్యాయస్థానం మందలించాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఉత్తరప్రదేశ్‌కు చెందిన లఖింపూర్ స్థానిక న్యాయస్థానం కేంద్ర మంత్రి అజయ్ మిశ్రా కుమారుడైన ఆశిష్ మిశ్రా బెయిల్ కోసం చేసిన విజ్ఞప్తిని తిరస్కరించింది. ఈ సంఘటనకు సంబంధించిన కొంతమంది నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకుని నిర్బంధంలో ఉంచారు. రైతులు, జర్నలిస్టులను ఉద్దేశపూర్వకంగానే వాహనంతో గుద్ది వారి మరణానికి కారణం అయ్యారని, నిందితులే ఆ ఘటనకు కారకులన్నది ఆరోపణ. ఈ సంఘటన జరిగినప్పుడు తీసిన వీడియో దృశ్యాలను చూసి సామాన్య ప్రజానీకం అవాక్కయ్యారు. కొద్దిమంది బిజెపి కార్యకర్తలు కూడా చనిపోయారనేది విచారకరం. ఈ సంఘటన తరువాత...ఉత్తరప్రదేశ్ న్యాయశాఖా మంత్రి బ్రజేష్ పాఠక్ బిజెపి కార్యకర్తల కుటుంబాలను సందర్శించారు. కానీ, ఈ ఘటనలో ప్రాణాలను కోల్పోయిన అమాయక రైతుల కుటుంబాలను మాత్రం సందర్శించలేదు. ప్రజల చేత ఎన్నికైన ఒక ప్రభుత్వం, దానిని నడిపించే మంత్రులు వారి రాజకీయ విశ్వాసాల పైన ఆధారపడి కాకుండా, రాజ్యాంగబద్ధంగా వ్యవహరించాలి. అటువంటి నైతికత తప్పనిసరి. రాజ్యాంగం ప్రకారం ఒక మంత్రి చేసే ప్రమాణంలోని ప్రతి అక్షరపు ఆత్మ అదే. స్వాతంత్ర్యం సాధించిన తరువాత ఉత్సవాల సందర్భంగా దేశ ప్రథమ ప్రధాని, జవహర్ లాల్ నెహ్రూ మాట్లాడుతూ, ఏర్పడింది కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అయినప్పటికీ, అది కాంగ్రెస్ పార్టీ నాయకుల నియంత్రణలో ఉండదని అభిప్రాయపడ్డారు. ఈ విశిష్ట లక్షణం, రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా ప్రతీ పాలక ప్రభుత్వానికి అన్వయించాలి.



కానీ ప్రజాస్వామ్య సంక్షోభ సమయంలో, అందరికీ ఆమోదయోగ్యమైన, ఇంత మంచి అంశం అస్పష్టంగా, కనపడకుండా కనుమరుగు అవుతున్నది. ప్రభుత్వం రాజకీయ పార్టీతో గుర్తించబడుతున్నది. అధ్వాన్నమైన విషయం ఏమిటంటే, ఆఖరికి రాజకీయ పార్టీలు కూడా ఒక వ్యక్తి స్థాయికి దిగజారి, వ్యక్తిని దేశానికి సమానం చేసి కీర్తిస్తాయి. 1975-77 ఎమర్జెన్సీకి ముందు కాంగ్రెస్ పార్టీ నాయకుడు డి.కె. బారువా రూపొందించిన "ఇండియానే ఇందిరా, ఇందిరే ఇండియా'' అనే నినాదాన్ని ఒకసారి గుర్తుకు తెచ్చుకోండి. ప్రస్తుతం దేశంలో రాజకీయ విగ్రహారాధన పునరావిర్భావం జరుగుతున్నది. ఇది, ఉత్తరప్రదేశ్‌లో న్యాయశాఖా మంత్రి వ్యవహరించిన విధంగా, క్యాబినెట్ మంత్రులు కూడా పక్షపాత ధోరణితో వ్యవహరించే పరిస్థితులకు దారితీస్తున్నది. ప్రజాస్వామ్య విలువలు దిగజారాయనడానికి ఇదొక సూచిక. 2014 ప్రారంభం నుండి కేంద్ర ప్రభుత్వం స్థిరంగా పార్టీకి, ప్రభుత్వానికి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని, కార్యనిర్వాహక జవాబుదారీతనాన్ని కోరే వ్యవస్థలను ఒక క్రమపద్ధతిలో బలహీనపరిచే చర్యలను పెంచుతూ వస్తున్నదని ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీకి చెందిన తరుణభ్ ఖైతాన్ పేర్కొంటారు. ఉత్తరప్రదేశ్, అస్సాం, గుజరాత్ రాష్ట్రాలలో ఖైతాన్ వ్యక్తం చేసిన అభిప్రాయాలు స్పష్టంగా ప్రతిబింబిస్తున్నాయి. ఇలాంటి ప్రజాస్వామిక అస్థిరత్వం యొక్క తీవ్ర ప్రభావాలు పైన తెలిపిన బిజెపి పాలిత రాష్ట్రాల్లో సమన్యాయ పాలనను పెకిలించివేయడంలో స్పష్టంగా వ్యక్తమయ్యాయి. రాజ్యాంగ సిద్ధాంతాలకు భిన్నంగా చట్టాలను అమలు చేయాలన్న ఆలోచనలను లఖింపూర్ ఘటన వివరిస్తుంది. రాజకీయాలను నేరపూరితం చేయడాన్ని మించి అనేక విషయాలను మనకు ఈ సంఘటన తెలియజేస్తుంది. ''నేరపూరితమైన రాజకీయాలు పవిత్రమైన ప్రజాస్వామ్యానికి ఒక శాప''మని 2014లో మనోజ్ నరూలా కేసులో సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. రాజ్యాంగ నీతిని మరియు సుపరిపాలనను గురించి సదరు తీర్పులో న్యాయస్థానం నొక్కి వక్కాణించింది. ''ప్రజల విశ్వాసం అనేది సుపరిపాలనా భావాల మూలాల్లో దాగి ఉంటుంది. మంచి పాలన అంటే పౌర హక్కుల పట్ల గౌరవ భావం కలిగి ఉండడం. ప్రభుత్వ చర్యలలో ప్రాథమిక హక్కులు, చట్టబద్ధమైన హక్కులు, అలిఖిత రాజ్యాంగ విలువలు, వ్యవస్థల సమగ్రతను గౌరవించడం. జవాబుదారీతనాన్ని పెంపొందించడమ''ని పేర్కొంది. ఉన్నావో నుంచి హత్రాస్ వరకు జరిగిన అనేక ఇతర సంఘటనలతో పాటు లఖింపూర్ ఘటన...ఉత్తరప్రదేశ్‌లో నేరాల రేటు పెరుగుతున్నదని రుజువు చేసింది. అంతేకాక, అలాంటి సంఘటనల పట్ల పాలనా వ్యవస్థ తీరును కూడా బట్టబయలు చేసింది. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో నివేదిక ప్రకారం, 2020లో ఉత్తరప్రదేశ్‌లో అత్యధిక హత్య కేసులు (3779) నమోదయ్యాయి. ఇక్కడ చట్టం అమలు ప్రక్రియ తరచుగా వెనుక సీటులోనే ఉంటోంది. లఖింపూర్ ఘటనలో నేరారోపణలు ఎదుర్కొంటున్న నిందితులను నిర్బంధంలోకి తీసుకునేందుకు కూడా ఉన్నత న్యాయస్థానం మందలించాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఉత్తరప్రదేశ్‌లోనే...విధులను నిర్వర్తిస్తున్న జర్నలిస్టులను అరెస్ట్ చేసి, చట్ట వ్యతిరేక కార్యకలాపాల నివారణా చట్టం (ఉపా) లాంటి అనాగరిక చట్టాలను ప్రయోగించి, నిర్బంధంలో ఉంచారు. పౌరసత్వ సవరణ చట్టాన్ని, రైతు వ్యతిరేక వ్యవసాయ చట్టాలను వ్యతిరేకిస్తూ నిరసనలను వ్యక్తం చేస్తున్నవారు కూడా అదే విధమైన ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఇప్పుడు కొత్తగా బూటకపు ఎన్‌కౌంటర్ మరణాలు, నిఘా పర్యవేక్షణలు మామూలైపోయాయి. ప్రజలు ఏదైనా ఆందోళన చేసేందుకు ఒకచోటుకు చేరే ప్రతీ సందర్భంలోనూ, వారు చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నారన్న ముద్ర వేసి క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ 144వ సెక్షన్‌ను ప్రయోగిస్తున్నారు. 2020లో జాతీయ భద్రతా చట్టం కింద 139 మందిని జైళ్లలో నిర్బంధిస్తే, వారిలో 76 మంది గోవధ చేశారనే ఆరోపణలను ఎదుర్కొంటున్న వారేనని సామాజిక కార్యకర్త హర్షమందిర్ పేర్కొన్నారు. 'లవ్ జీహాద్' ఆరోపణలు చేస్తూ అనేక జంటలను అరెస్ట్ చేశారు. హత్యలు, అత్యాచారాలు లాంటి నీచమైన నేరాలకు పాల్పడిన రాష్ట్రం వ్యక్తిగతమైన సాన్నిహిత్యాన్ని ఒక తీవ్రమైన నేరంగా ముద్ర వేయడానికి అత్యుత్సాహాన్ని ప్రదర్శిస్తుంది. అధికారంలో ఉన్నవారి అవసరాలకు అనుగుణంగా చట్టాలను దుర్వినియోగం చేయడం లేదా అసలు చట్టాలను వినియోగించక పోవడం లేదా చట్టాలను పరిమితంగా ఉపయోగించడం నేటి ఉత్తరప్రదేశ్ కొత్త న్యాయ విధానం. అస్సాం, త్రిపుర లాంటి రాష్ట్రాలు కూడా అదే విధానాన్ని అనుసరించాయి. అస్సాం లోని దారంగ్ జిల్లాలో జరిగిన పోలీసు కాల్పుల్లో ఇద్దరు వ్యక్తులు చనిపోయిన సందర్భాన్ని గుర్తు చేసుకోండి. వారిలో ఒకరి మృతదేహాన్ని ఓ ఫోటోగ్రాఫర్ తంతున్న వీడియో సమస్యాత్మక సమయాల్లో పరిస్థితిని తెలియజేస్తుంది. నిజమైన ప్రజాస్వామ్యం లేకపోతే మనిషికి గౌరవం ఉండదు. "సమానమైన గౌరవం, సమానమైన ఆందోళన/బాధ" సమ న్యాయ పాలన ముఖ్య లక్షణాలని న్యాయకోవిదుడు రోనాల్డ్ డ్వార్కిన్ అభిప్రాయపడ్డారు. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అన్నవి సర్వసమానత్వ భావనలో ఎంతమాత్రం బేరమాడడానికి వీలులేని దృక్కోణాలు. న్యాయ నిపుణుడు, ఎ.వి.డైసీ వివరించినట్లు...రాజ్యాంగానికి లోబడి ఉండే ప్రజాస్వామ్యాలలో, సమ న్యాయ పాలన అధికార నిరంకుశత్వాన్ని తిరస్కరిస్తుంది. చట్టం నేడున్న రాజకీయాలకు మించి ఉన్నతంగా ఉండాలి. కానీ, ఉత్తరప్రదేశ్ నమూనాలో చట్టం రాజకీయ అధికారం చేతిలో కేవలం ఒక ఆయుధం మాత్రమే. లఖింపూర్ ఘటన ఉత్తరప్రదేశ్ లోని న్యాయ వ్యవస్థ, రాజకీయ వ్యవస్థల వైఫల్యాల గురించి...అనేక గ్రంథాలు రాయడానికి సరిపడా సమాచారాన్ని అందిస్తుంది.

# పైసా.. పైసా.. కూడబెడితేనే..!

'ధనమేరా అన్నిటికీ మూలం/ ఆ ధనము విలువ తెలుసుకొనుట మానవధర్మం/ మానవుడే ధనమన్నది సృజియించెనురా/ దానికి తానే తెలియని దాసుడాయెరా...' అంటాడు ఆరుద్ర. 'బూంద్ బూంద్ బనేగా సముందర్, పైసా పైసా జమాతో రుపయా హొయేగా' అనేది హిందీ సామెత. ఒక్కొక్క బిందువు కలిస్తేనే మహాసముద్రం... పైసా పైసా కలిస్తేనే రూపాయి అవుతుందని దాని అర్థం. 'చిల్లర దరి చేర్చుతూ పోతే/ అవే ధన సమూహాలు/ ఖర్చు చేస్తూ పోతే/ ఛిద్ర మార్గంలో నీవు/ పొదుపు చేస్తూ పోతే/ ప్రగతి పథంలో నీవు' అంటాడో కవి. రూపాయిని చిల్లర చేస్తే నాణాలుగా మారుతుంది. చిల్లరను ఒకచోట చేర్చితే... ధన సమూహం అవుతుంది. పొదుపు జీవితంలో అవకాశాలను కల్పిస్తుంది. సంతోషంగా బతకడానికి మార్గాన్ని చూపుతుంది. అందుకే అంటారు... 'ధనం మూలం ఇదం జగత్' అని. భవిష్యత్ కోసం సంపాదించిన దానిలో కొంత మిగుల్చుకోవడమే పొదుపు. ఎంత సంపాదిస్తున్నారనేదానికంటే ఎంత పొదుపు చేస్తున్నారనేదే ముఖ్యం. సంపాదించినదంతా ఖర్చు చేస్తే... భవిష్యత్తు శూన్యం. ఎంతోకొంత పొదుపు చేసుకోగలిగితే... కష్టకాలంలో ఇంకొకరి దగ్గర చేయి చాచే పరిస్థితి నివారించవచ్చు. సంపాదించిన దానిలో కొంత దాచుకోవడమనేది పొదుపే... కానీ, ఇప్పుడున్న పరిస్థితుల్లో... అరకొర ఆదాయాలతో బతకడానికే ఆపసోపాలు పడుతుంటే... పొదుపు ఎలా చేయాలి? అనేది పెద్ద ప్రశ్న. నయా ఉదారవాద ఆర్థిక విధానాల పుణ్యమాని... ప్రపంచంలో వినిమయదారీ సంస్కృతి విపరీతంగా పెరిగింది. ఈ నేపథ్యంలో పొదుపు చేయడం సంగతి అటుంచి... మార్కెట్‌లో కనిపించే వస్తువుల పట్ల ఆకర్షణ పెరిగింది. చేతిలో పైసా లేకపోయినా... అప్పుచేసి పప్పుకూడు అన్న చందంగా మార్చింది వినిమయదారీ సంస్కృతి. క్రెడిట్ కార్డులు, ఇఎంఐల సంస్కృతి పెంచుతూ మధ్యతరగతి జీవితాలను ఆశల పల్లకిలో విహరింపజేస్తున్నాయి. 'అప్పు తెచ్చి వేసిన మిద్దెల్లో/ కాలుగాలిన పిల్లిలా తిరుగుతున్న దీనత్వం నీది' అంటాడు చెరబండరాజు. ఈ కార్డుల వినియోగం సులభంగా వున్నా... ఖర్చు చేయిదాటి... ఆర్థిక భారం పెరిగిపోతుంది. పొదుపు ఒక్క డబ్బు విషయంలోనే కాదు... నీరు, విద్యుత్, ఆహారం వృథాను అడ్డుకొని పొదుపుగా వాడుకోవాలి. లేదంటే... రాబోయే తరాలు దాని దుష్పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుంది. తరతరాలకు మనుగడనిచ్చే ప్రకృతి, పర్యావరణం, గాలి, నీరు, నేల వంటి అన్నింటి వినియోగంలోనూ పొదుపు అవసరం. ఇప్పటికే అపరిమిత కాలుష్యంతో జీవితాలు చెయ్యిజారిపోయే పరిస్థితి ఏర్పడింది. ఆ మాట కొస్తే మన మాటల్లోనూ పొదుపు అవసరమే. మాటల్లో అదుపు, మనీలో పొదుపు



పాటించకపోతే... జీవితంలో భారీ కుదుపులు భరించక తప్పదు. ఆసియా దేశాల్లో పొదుపు చేయడం వారసత్వంగా వుంది. ఇప్పటికీ ఏదోకమేర ఎంతోకొంత పొదుపు కొనసాగుతోంది. పాశ్చాత్య దేశాలతో పోల్చుకుంటే... ఆసియా దేశాలే మెరుగ్గా వున్నాయి. ఆ దేశాల్లో ప్రజలు తమ రాబడికంట్టే ఎక్కువగా ఖర్చు చేస్తుంటే.... మనం ఎంతోకొంత పొదుపు చేస్తుంటాం. అయితే ఇటీవల ఈ పొదుపు చేయడమనేది తగ్గుతుందని అనేక రిపోర్టులు చెబుతున్నాయి. 2008లో మనదేశ స్థూల పొదుపు రేటు 37.8 శాతం వుంటే, 2020 నాటికి 31.4 శాతానికి తగ్గిపోయింది. ప్రపంచంలో 40వ స్థానంలో వున్నాం. ఈ సూచీని మెరుగు పర్చుకోలేకపోతే... దేశం పరిస్థితి అయినా... కుటుంబాల పరిస్థితి అయినా చిన్నాభిన్నం అవుతుంది. 'ఉన్ననాడు తెలివి కలిగి పొదుపు చేయరా/ లేనినాడు ఒడలు వంచి కూడబెట్టరా/ కొండలైన కరిగిపోవు కూర్చుని తింటే/ అయ్యో కూలిపోవు కాపురాలు ఇది తెలియకుంటే...' అంటాడు ఆరుద్ర. అనవసరమైన వృథాను అడ్డుకొని, రేపటికోసం కొంత దాచాలన్నది తరతరాలుగా వస్తోన్న సంప్రదాయం. మన పెద్దలు నేర్పిన బతుకుపాఠం. కుటుంబ భవిష్యత్తు, దేశ భవిష్యత్తు ఎంత ముఖ్యమో... ఆర్థిక పరమైన విషయాల పట్ల అవగాహన కూడా అంతే అవసరం. ఈ బతుకు బండిని నడపడం పట్ల అవగాహన కల్పించడానికి, పొదుపు ప్రాధాన్యతను తెలియజేయడానికి ఏర్పాటు చేయబడిందే... 'ప్రపంచ పొదుపు దినోత్సవం'. కనుక వృథా ఖర్చును నియంత్రించుకొని, పొదుపును ఒక బాధ్యతగా మార్చుకోవాలి. అప్పుడే ఈ లక్ష్యం నెరవేరుతుంది.

# చేనేతలకే చేనేత శాఖి

కర్నూలు అక్టోబర్ 24, ఆదివారం ఉదయం నందవరంలో చేనేత సమాజం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశం విజయవంతమైంది. రాష్ట్రము నలువైపుల నుండి చేనేత కులాలకు చెందిన రాష్ట్ర స్థాయి సంఘ ప్రతినిధులు సుమారు 300 పైగా పాల్గొన్నారు. ప్రారంభోపన్యాసం చేసిన కే.వీ శేషయ్య నేత గారు చేనేత మంత్రిత్వ శాఖను చేనేతల ఆడపడుచు ఎమ్మెల్సీ పోతుల సునీత గారికి ఇవ్వాలన్నారు. చేనేతలు రాజకీయముగా ఎదగాలని, అందుకు చేనేతల ప్రధాన కేంద్రాల్లో పోటీ చేయటానికి ముందుకు రావాలని మాజీ మంత్రి నిమ్మల కిష్టప్ప గారు పిలుపునిచ్చారు. గ్రామ స్థాయి నుండి చేనేతలను చైతన్యం చేస్తూ ఐక్యత పెంపొందించుకోవాలని, అభివృద్ధి సాధించాలని కర్నూల్ మాజీ ఎంపీ శ్రీమతి బుట్టా రేణుకగారు అన్నారు. చేనేతల ఐక్యతయే అభివృద్ధికి మార్గమని వేరువ వెంకటేశ్వర్లు గారు పేర్కొన్నారు. ఒక్క ఫోన్ కాల్ తోనే చేనేత సమావేశానికి చేనేతలు తరలి రావడం చేనేతల చైతన్యానికి నిదర్శనమని జింక విజయలక్ష్మి తెలిపారు. ఈ సమావేశంలో పోతుల సునీత గారు, నిమ్మల కిష్టప్ప గారు, బుట్టా రేణుక గారు, దేవాంగ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ బీరక సురేంద్రగారు, పద్మశాలి ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్పర్సన్ జింక విజయలక్ష్మి గారు, తొగట ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్పర్సన్ గడ్డం సునీత గారు, కుర్ని ఫైనాన్స్ కార్పొరేషన్ బుట్ట శారదమ్మ గారు, హ్యాండీక్రాఫ్ట్ కార్పొరేషన్ చైర్పర్సన్ బడిగంచల విజయలక్ష్మి గారు, మంగళగిరి మాజీ మున్సిపల్ చైర్మన్ గంజి చిరంజీవి గారు, పెడన మాజీ మున్సిపల్ చైర్మన్ బండారు ఆనంద ప్రసాద్ గారు, చింతా శ్రీనివాస్ గారు, కర్ర రవి గారు, కరెళ్ల గణపతి రావు గారు, కరెళ్ల రజినీకాంత్ గారు, డాక్టర్ సమతం మహేష్ గారు, మాదుగుండు కృష్ణ గారు, %ణఖ% నాగరాజు గారు, నక్కలమిట్ట శ్రీనివాసులు, ఓంకారయ్య గారు, సి బి అజయ్ కుమార్ గారు, కొంకతి లక్ష్మీనారాయణ గారు, రామనాథం పరమేశ్వర రావు గారు, జగ్గారపు శ్రీనివాసరావు గారు, చిలువేరు మార్కండేయులు గారు, ముట్టె శ్రీరామచంద్ర రావు గారు, గుత్తి త్యాగ రాజు గారు మరియు చేనేత కుల సంఘాల, వృత్తి సంఘాల నాయకులు అనేకులు పాల్గొన్నారు.






## ఖత్నా కార్యక్రమంలో పాల్గొన్న వైసీపీ మైనార్టీ నాయకుడు

పొన్నూరు అక్టోబర్24 ప్రజా పాలన ప్రతినిధి:పొన్నూరు వైసీపీ మైనార్టీ నాయకుడు నాజర్ ఆదివారం ఖత్నా కార్యక్రమంలో పాల్గొన్నారు. డఫ్ పేటలోని బాషకుమారుడి ఖత్నా కార్యక్రమంలో పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో వార్డు నాయకులు జానీ , సుబాని, బాష పలువురు నాయకులు అభిమానులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో మాజీ సర్పంచ్ మృతి

**నివాళులు అర్పించిన ఎమ్మెల్యే, మాజీ మంత్రి, నేతలు**



చీరాల(ఒంగోలు) అక్టోబరు 24 ప్రజాపాలన ప్రతినిధి: : చీరాల మండలం, దేవినూతల గ్రామ మాజీసర్పంచ్ వర్లు వెంకటేశ్వర్లు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. విషయం తెలిసి,వారింటికి శాసనసభ్యులు కరణం బలరాం కృష్ణమూర్తి వెళ్లారు.వెంకటేశ్వర్లు పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.వారి కుటుంబ సభ్యులకు, తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట, మాజీ మంత్రి డా.పాలేటి రామారావు, రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్లు గవిని శ్రీనివాసరావు, మల్లి వైష్ణవి, మున్సిపల్ చైర్మన్ శ్రీనివాసరావు, కోఆప్షన్ సభ్యులు, వైస్ చైర్మన్,మున్సిపల్ కౌన్సిలర్లు, నియోజకవర్గ వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

## న్యాయ విజ్ఞాన సదస్సును సద్వినియోగం పర్చుకోండి : మొవ్వ మెజిస్ట్రేట్ ప్రధమ శ్రేణి న్యాయమూర్తి రమ్య



**ఘంటశాల,** అక్టోబరు 24 ప్రజాపాలన ప్రతినిధి: న్యాయ విజ్ఞాన సదస్సును ప్రతి ఒక్కరూ సద్వినియోగ పర్చుకుని అవగామన పెంచుకోవాలనీ మొవ్వ మెజిస్ట్రేట్ ప్రధమ శ్రేణి న్యాయమూర్తి బి. రమ్య పేర్కొన్నారు. మండల పరిదిలోని కొడాలి పంచాయితీ ఆవరణలో న్యాయ విజ్ఞాన సదస్సు పై అవగాహన నిర్వహించారు. న్యాయమూర్తి రమ్య మాట్లాడుతూ రాజ్యాంగంలో పొందుపరిచిన చట్టాల పై ప్రతి ఒక్కరికీ పూర్తి అవగాహన కలిగి ఉండాలనే ఉద్యేశ్యంతోనే ప్రభుత్వం గ్రామస్థాయిలో న్యాయ విజ్ఞాన సదస్సులు ఏర్పాటు చేయటం జరిగుతుందన్నారు. ఈ సదస్సును అందరూ సద్వినియోగపర్చుకోవాలనీ, రాజీ పడదగ్గా కేసులు ఉంటే లోక్ అదాలత్‌లో రాజీ చేసుకోవాలనీ, రాజీ మార్గమే రాజ మార్గమనీ ఆమె పేర్కొన్నారు. ఆమెతో పాటు బార్ అసోసియేషన్ అధ్యక్షులు వేణుగోపాల్, ఎస్సై లక్ష్మీనరసింహమూర్తి, కోర్టు కానిస్టేబుల్ జి.వి. కృష్ణ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధికి నిరంతర కృషి: ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్



భీమవరం, అక్టోబర్ 24 (ప్రజాపాలన ప్రతినిధి) : గ్రామాలే దేశానికి పట్టుకొమ్మలని వాటి అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని శాసనసభ్యులు గ్రంధి శ్రీనివాస్ అన్నారు. భీమవరం మండలంలోని దెయ్యాల తిప్ప గ్రామంలో రూ 9 లక్షలతో నిర్మించిన అంగన్వాడి భవనాన్ని ఆయన ఆదివారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాలలో ఇప్పటికే సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, వైయస్సార్ హెల్త్ క్లినిక్ లను నిర్మించామని అన్నారు. మరికొన్ని గ్రామాలలో ఈ భవనాలు నిర్మాణదశలో ఉన్నాయని తెలిపారు. గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యని తీసుకురావడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పనిచేస్తున్నారని అన్నారు. రాష్ట్ర రాజధానిలో ఉండాల్సిన సచివాలయాలను గ్రామ స్థాయిలో ఏర్పాటుచేసి రేషన్ కార్డులు, కుల, ఆదాయ, ధ్రువీకరణ పత్రాలు ,ఆధార్ కార్డులు ఇలా సుమారు 570 రకాల సేవలను అందిస్తున్నామని గతంలో వీటికోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రజలు కాళ్లరిగేలా తిరిగే వారిని గుర్తుచేశారు. కానీ నేడు ఆపరిస్థితి లేదని ప్రతి 50 కుటుంబాలకు వలంటీర్లను నియమించి సుపరిపాలన అందిస్తున్నామని ప్రతినెల ఒకటో తారీకు వేకువజామునే పింఛన్లు అందిస్తున్నామని అర్హులైన ప్రతిఒక్కరికీ ఇళ్ల స్థలాలు, పట్టాలు అందించడం జరిగిందని అన్నారు. యనమదుర్రు డ్రెయిన్ పై నిర్మించిన వంతెనలకు రూ 30 కోట్ల పైగా నిధులతో అప్రోచ్ రోడ్లను నిర్మిస్తున్నామని త్వరలోనే పనులు ప్రారంభమవుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ తిరుమాని ఏడుకొండలు, ఎంపీపీ పేరిచర్ల విజయనరసింహ రాజు, జడ్పిటిసి కాండ్రేగుల నరసింహారావు, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ కామన నాగేశ్వరరావు, తాసిల్దార్ ఏ వి రమణరావు ,ఎంపిడిఓ జి పద్మ, అంగన్వాడి ప్రాజెక్టు అధికారి వాణి విజయరత్నం, సర్పంచ్ శ్రీనివాస్, ఎంపీటీసీ నరసింహ స్వామి తదితరులు పాల్గొన్నారు.

## అమ్మ వారి దేవస్థానం ప్రాంగణంలో.. నూతన భవన నిర్మాణము కొరకు శంకుస్థాపన

**శంకుస్థాపన చేసిన వేటపాలెం జెడ్పిటిసి బండ్ల.తిరుమలదేవి, బండ్ల బాబు దంపతులు రు.8లక్షలు విరాళం అందజేసిన అచ్యుతుని.లక్ష్మీనరసింహారావు,పద్మజా దంపతులు**




చీరాల(ఒంగోలు) అక్టోబరు 24 ప్రజాపాలన ప్రతినిధి: : వేటపాలెం మండలం రామన్నపేట పంచాయితీ, రావూరిపేట శివారులో వేంచేసి ఉన్నటువంటి, శ్రీ కనక నాగవరపమ్మ అమ్మ వారి దేవస్థానం ప్రాంగణంలో, నూతనముగా బిల్డింగ్ నిర్మాణము కొరకు, దాత అచ్యుతుని లక్ష్మీనరసింహారావు,పద్మజా దంపతులు, రు. 8 లక్షలు విరాళం అందజేశారు. దాతల సహాయ సహకారాలతో, వేటపాలెం జెడ్పిటిసి బండ్ల.తిరుమల దేవి, బండ్ల బాబు దంపతుల చేతులమీదుగా, భవన నిర్మాణము కొరకు, శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ శంకుస్థాపన కార్యక్రమంలో, ఆలయట్రస్ట్ బోర్డుచైర్మన్ అచ్చంశెట్టి భానుమూర్తి, ధర్మకర్తలు గౌరాబత్తుని కనకదుర్గ, నాగేశ్వరరావు, దేవన లక్ష్మీపార్వతి, గంగాధరరావు, తిమ్మసముద్రం దేవాదాయశాఖ ఈవో శ్రీనివాసరావు, ఆలయ సిబ్బంది మరియు దాతల కుటుంబ సభ్యులు హనుమంతరావు, తదితరులు పాల్గొన్నారు.

## అత్యంత ఘనంగా, కనులపండువగా ఈనాడు విలేకరి వివాహ మహోత్సవ వేడుక



చీరాల(ఒంగోలు)అక్టోబరు 24 ప్రజాపాలన ప్రతినిధి: : వేటపాలెంమండలం, కొత్తపేట శ్రీనివానపురంలోని, శ్రీ అవ్వారు మోహన్‌కుమార్, శ్రీ సీతారామ కళ్యాణమండపంలో, ఈనాడు విలేకరి ఆకురాతి మల్లేశ్వరరావు (మల్లి), శిరీష ల వివాహ మహోత్సవ వేడుకలు, శ్రేయోభిలాషులు, ఆత్మీయుల నడుమ, అత్యంత ఘనంగా, కనులపండువగా, అత్యంత వైభవంగా జరిగాయి.సామాజిక సేవా దృక్పథం కలిగిన వ్యక్తి కావడంతో, ప్రజల సమస్యల పట్ల నిరంతరం స్పందించే తత్వంతో పాటు, అందరిని గౌరవంగా అన్నా అంటూ పిలుస్తూ, అందరితో కలివిడిగా ఆప్యాయంగా ఉండే విలేకరి కావడంతో, పార్టీలకతీతంగా, ఆయా రాజకీయ పార్టీల నాయకులు ఆయా రంగాల ప్రముఖులు పెద్ద సంఖ్యలో హాజరై, మల్లేశ్వరరావు శిరీష దంపతులను ఆశీర్వదించారు. జర్నలిస్ట్ సంఘ రాష్ట్ర నాయకులు బాబు జాజా నంద్, కొనికి శ్రీనివాసరావు, గుర్నాథం, చైతన్య, మణి, నాగమణి తదితర ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులు, అధికారులు, స్థానిక ప్రముఖులు కౌతవరపు జనార్దన్ తోట శ్రీనివాసరావు తదితరులు వివాహ మహోత్సవానికి హాజరై, వధూవరులైన శిరీష, నాగమల్లేశ్వరరావులను ఆశీర్వదించారు.ఆయా రంగాల ప్రముఖులు, తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తెలంగాణ నుండి అక్రమంగా తరలిస్తున్న 40మద్యం సీసాలు స్వాధీనం

జగ్గయ్యపేట24అక్టోబర్(ప్రజాపాలనప్రతినిధి)కృష్ణాజిల్లా ఎస్పీ శ్రీ సిద్ధార్థ కౌశల్ ఆదేశాలు మేరకు, నందిగా మ డిఎస్పి నాగేశ్వర రెడ్డి పర్యవేక్షణలో, జగ్గయ్యపేట సీఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో, చిల్లకల్లు ఎస్సై రమేష్ కి అందిన రహస్య సమాచారం మేరకు సిబ్బందితో క లిసి జగ్గయ్యపేట మండల పరిధిలో, ముక్త్యాల చెక్ పోస్ట్ వద్ద తెలంగాణ రాష్ట్రము నుండి




ముక్త్యాల కి అక్రమంగా మద్యం తరలిస్తున్న 1). గూగులోతు కోట య్య , 2. గూగులోతు కోటేశ్వరరావు అను వారిని అ దుపులోకి తీసుకొని, వారి వద్ద నుండి రూ. 4800/- విలువ గల 40 మద్యం సీసాలను మరియు ఒక ద్వి చక్ర వాహనాన్ని స్వాధీన పరచుకొని వారిపై కేసు నమోదు చేసినారని చిల్లకల్లు రమేష్ తెలిపారు.

## అమ్మన్న తల్లి అమ్మవారి విగ్రహ ప్రతిష్టలో పాల్గొన్న జెడ్పీ చైర్మన్ ఉప్పల హారిక, రాము

బంటుమిల్లి పెడన ప్రజాపాలన అక్టోబర్ 24 :కృష్ణా జిల్లా ముదినేపల్లి మండలం వడలి గ్రామం లో పరస వారి ఇలవేల్పు శ్రీ శ్రీ శ్రీ అమ్మ న్న తల్లి అమ్మ వారి నూతన విగ్రహ ప్రతిష్ట లో కృష్ణా జిల్లా జడ్పీ చైర్మన్ ఉ ప్పల హారిక రాము పాల్గొన్నారు అర్చకుల చే అమ్మ వారి ఆశీస్సులు అందుకున్నారు అదే సమయంలో అమ్మవారి ఆలయానికి వచ్చిన పెడన నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ కాగిత కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఎమ్మెల్యే జోగి రమేష్

బంటుమిల్లి(పెడన) అక్టోబరు 24 ప్రజాపాలన ప్రతినిధి: కృష్ణాజిల్లా పెడన శాసనసభ్యులు జోగి రమేష్ సోమవారం నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటారనీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ ఆనంద్ తెలిపారు గత వారం రోజులుగా ఎమ్మెల్యే జోగి రమేష్ విదేశీ పర్యటనలో ఉండటం అందరికి తెలిసిన విషయమే సోమవారం ఉదయం నుండి సాయంత్రం వరకు వివిధ కార్యక్రమాల్లో పాల్గొని పార్టీ కార్యాలయంలో అందరికీ అందుబాటులో ఉంటారు వివిధ సమస్యలపై వచ్చిన నియోజకవర్గ ప్రజలతో ఆయన మాట్లాడతారు.

## జన ఆగ్రహ దీక్ష



ఏలూరు అక్టోబరు 24 ప్రజాపాలన ప్రతినిధి: ఏలూరు పశ్చిమగోదావరి జిల్లా వైసీపీ నాయకులు సీఎం జగన్ పై అనుచిత వ్యాఖ్యలపై మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు నోరు అదుపులో పెట్టుకో సీఎం జగన్ మీద అనుచిత వాక్యలు చేసిన టీడీపీ నాయకుడు పట్టాభి వాక్యలను కండిస్తూ రెండు రోజులుగా పశ్చిమగోదావరి జిల్లా లో వివిధ సెంటర్ లో వైస్సార్సీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జన ఆగ్రహ దీక్షలో వైసీపీ పశ్చిమ గోదావరి జిల్లా మహిళ నాయకు రాలు గుదూరి ఉమ బాల ఈ సందర్భంగా మాట్లాడుతూ టీడీపీ నాయకులు సీఎం జగన్ మంచి పరిపాలన చూసి ఓర్వలేక ఇటువంటి దుర్మార్గపు మాటలు మాట్లాడు తూన్నారు అని వారి మాటలు విని రాష్ట్ర ప్రజలు చంద్రబాబును,టీడీపీ నాయకులను చీదరించు కుంటున్నారు అని అన్నారు. తీరు మార్చు కొకపోతే వైసీపీ నాయకులు చూస్తూ ఊరుకోరు అని హెచ్చరించారు.

## సీపీఎం మహాసభలు జయప్రదం కోరుతూ జెండా ఆవిష్కరణ




చీరాల(ఒంగోలు) అక్టోబరు 24 ప్రజాపాలన ప్రతినిధి: : సీపీఎం చీరాలఏరియా 10వ మహాసభలు, ఈనెల 30,31 తేదీలలో, చీరాల అంబేద్కర్ భవన్‌లో జరగనున్న నేపథ్యంలో, మహాసభలు జయప్రదం కోరుతూ పార్టీజెండాను, ఆ పార్టీకార్యకర్తలు గడియార్స్తంభసెంటర్‌లో ఆవిష్కరించారు. జెండాను, పార్టీ సీనియర్ నాయకుడు ఢాకా నారపరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీనాయకులు ఎమ్.వసంతరావు మాట్లాడుతూ, సీపీఎం ఏర్పడినప్పటి నుండి నేటివరకు, ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేస్తుంది అన్నారు. నేడు కేంద్ర రాష్ట ప్రభుత్వాలు అవలంభిస్తున్న, ఆర్థిక విధానాలు కారణంగా పేదలు, సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కార్యక్రమానికి దేవతోటి నాగేశ్వరరావు అధ్యక్షత వహించగా, కమిటీ కార్యదర్శి ఎన్.బాబురావు, నాయకులు ఎల్.జయరాజు,జి.గంగయ్య, పి.ఆదిశంకర్, సుందర్, తదితరులు పాల్గొన్నారు.

# 'చిత్రావతి' నిర్వాసితులకు అందని పరిహారం

అనంతపురం అక్టోబరు 24 ప్రజాపాలన ప్రతినిధి: చిత్రావతి బ్యాలెన్సింగు రిజర్వాయరు (సిబిఆర్) నిర్వాసితుల గోడు పాలకులకు పట్టడం లేదు. గతేడాది అక్టోబరులో వన్‌టైం సెటిల్‌మెంట్ కింద పరిహారం చెల్లించి ఊరు ఖాళీ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇందుకు సంబంధించి రూ.240.53 కోట్లు నిధులు కేటాయిసూ్తా ఉత్తర్వులిచ్చింది. దీంతో, నిధులొచ్చేశాయంటూ ఉన్నఫలంగా నిర్వాసితులందరినీ ఊరి నుంచి అధికారులు బలవంతంగా ఖాళీ చేయించారు. ఈ రిజర్వాయర్ పరిధిలో 1,503 నిర్వాసిత కుటుంబాలు ఉన్నట్లు అధికారులు తొలుత గుర్తించారు. వీటిలో 1,308 కుటుంబాలకు మాత్రమే వన్‌టైం సెటిల్‌మెంట్ కింద సుమారు రూ.200 కోట్లు పరిహారమిచ్చారు. మిగతా 195 కుటుంబాలకు పరిహారం అందలేదు. చిత్రావతి బ్యాలెన్సింగు రిజర్వాయరు కింద తాడిమర్రి మండలంలోని సిసిరేవు, మరిమేకులపల్లి గ్రామాలు, ముదిగుబ్బ మండలంలోని పిసిరేవు, రాఘవంపల్లి గ్రామాలు ఉన్నాయి. పరిహారం జాబితాలో తమ పేర్లు లేవని మరిమేకులపల్లి గ్రామానికి చెందిన నిర్వాసితులు అప్పట్లోనే ఆందోళన చేపట్టారు. తమ గ్రామానికి కటాఫ్ తేదీని 2006 వరకు పెట్టారని నిరసనలు చేపట్టడంతో మరికొన్ని పేర్లు



అధికారులు పరిశీలించారు. మరో 200 నిర్వాసితులు ఉన్నట్టుగా అధికారులు తేల్చి జాబితా సిద్ధం చేశారు. కొత్తగా గుర్తించిన వారికి కూడా పరిహారం ఇవ్వలేదు. ఒక్కో ఇంటికి రూ.10 లక్షల చొప్పున మంజూరు చేసి ఏడాది పూర్తయినా పరిహారం అందక నిర్వాసితులు ఎదురుచూస్తున్నారు. దీంతో, మొత్తం 395 కుటుంబాలూ పరిహారం కోసం కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోంది. అధికారులు దీనిపై నోరు మెదపడం లేదు.

**ధ్రువీకరణ పత్రాలు అందక అవస్థలు**

రిజర్వాయరులోకి పది టిఎంసిల పూర్తి సామర్థ్యంతో గతేడాది నీరు నింపడంతోపై నాలుగు గ్రామాలూ నీటిలో మునిగిపోయాయి. ఆయా గ్రామాల ప్రజలు కొంతమంది ముంపునకు గురైన ప్రాంతాన్ని వదిలి ఎగువ భాగంలో కొత్తగా ఇళు కట్టుకుని నివాసముంటున్నారు. ఈ గ్రామాలు ముంపు కింద రికార్డుల్లో ఉన్నందున కొత్తగా ఎగువ భాగంలో ఇళ్లు కట్టుకున్నప్పటికీ నివాస, ఆదాయ, కుల, ఇతర ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయలేమని అధికారులు చెబుతున్నారు. దీంతో రైతులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

## పాత్రికేయులు జగన్మోహనరావుకు ఆర్థిక సాయం



**ఘంటశాల,** అక్టోబరు 24 ప్రజాపాలన ప్రతినిధి: ఘంటశాల మండల పాత్రికేయులు సి.హెచ్. జగన్మోహనరావు ఇటీవల విజయవాడలో ప్రవేటు ఆసుపత్రిలో గుండె శస్త్ర చికిత్స ఇంటికి తిరిగి రావటం జరిగింది. విషయం తెలుసుకున్న అవనిగడ్డకు చెందిన శ్రీరామా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు తోటా శ్యాంకిషోర్ నాయుడు ఆదివారం ఆయన స్వగృహంలో పరామర్శించి, త్వరగా కోలుకోవాలనీ ఆకాంక్షించారు. వైద్య ఖర్చుల నిమిత్తం రూ. 5000 వేలు ఆర్ధిక సాయాన్ని అందించారు.

## ఇది చైనా అంతర్గత వ్యవహారాల్లో జోక్యమే

**ఐరాస వేదికగా 80కి పైగా దేశాల ప్రకటన**



యునైటెడ్ నేషన్స్ : మానవ హక్కుల పేరుతో చైనా అంతర్గత విషయాల్లో జోక్యం చేసుకోవడాన్ని దాదాపు 80కి పైగా దేశాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ 76వ వార్షిక సమావేశం మూడో సెషన్‌లో ఈ దేశాలు చైనాకు తమ మద్దతు ప్రకటించాయి. మానవ హక్కుల పేరుతో చైనాను ఇబ్బంది పెట్టాలని అమెరికా, కొన్ని పశ్చిమ దేశాలు ఇటీవల తమ దాడిని ఉధృతం చేశాయి. ఈ అసత్య ప్రచారాన్ని తిప్పికొడుతూ 62 దేశాల తరపున క్యూబా, మూడు గల్ఫ్ దేశాల తరపున కువైట్ గట్టిగా తమ వాణిని వినిపించాయి. మరో ఇరవై దేశాలు విడివిడిగా చేసిన ప్రకటనల్లో చైనాకు మద్దతు పలికాయి. సార్వభౌమత్వం, స్వాతంత్ర్యం, ప్రాదేశిక సమగ్రతను గౌరవించడం, ఒకరి ఆంతరంగిక వ్యవహారాల్లో మరొకరు జోక్యం చేసుకోకుండా ఉండడం అంతర్జాతీయ సంబంధాల్లో పాటించాల్సిన కనీస నియమం అని క్యూబా మరి కొన్నిదేశాలు కలసి చేసిన సంయుక్త ప్రకటన పేర్కొంది. హాంకాంగ్, షింజియాంగ్, టిబెట్ చైనా అంతర్గత వ్యవహారాలని, బయటి జోక్యం తగదని ఆ ప్రటన స్పష్టం చేసింది.హాంకాంగ్ ప్రత్యేక పాలిత ప్రాంతంలో చైనా అమలు చేస్తున్న 'ఒక దేశం-రెండు వ్యవస్థలు' విధానానిన్న ఆ ప్రకటన ప్రశంసించింది.మూడు గల్ఫ్ దేశాల తరపున కువైట్ చేసిన ఉమ్మడి ప్రకటన కూడా చైనాకు పూర్తి మద్దతు ప్రకటించింది.ఐరాసలో చైనా శాశ్వత ప్రతినిధిగా ఉన్న జాంగ్ జున్ అమెరికా, ఫ్రాన్స్‌తో పాటు పలు దేశాలు చేస్తున్న నిరాధార ఆరోపణలను నిర్ద్వంద్వంగా తోసిపుచ్చారు. తమ దేశాల్లో జరుగుతున్న తీవ్రమైన మానవ హక్కుల ఉల్లంఘనలను కప్పిపుచ్చుకునేందుకు చైనాపై ఆరోపణలు చేయడం అమెరికాకు అలవాటుగా మారిపోయిందని ఆయన విమర్శించారు.

# ఈ ప్రశ్నకు బదులేది ?

## అసెంబ్లీలో సభ్యుల ప్రశ్నలకు రాని జవాబులు

## హక్కుల ఉల్లంఘనేనంటున్న శాసనసభ్యులు



అమరావతి,అక్టోబరు 24 ప్రజాపాలన ప్రతినిధి: ప్రజా సమస్యలపై చర్చించేందుకు ప్రశ్నలు వేయడం శాసనసభ్యుల హక్కు. సభ్యులు అడిగిన ప్రశ్నలకు వివిధ శాఖల అధికారులు పూర్తి వివరాలతో సమాధానాలివ్వాల్సి ఉంటుంది. అయితే కొన్ని సంవత్సరాలుగా అధికారుల నుండి సంబంధిత సభ్యులకు జవాబులు అందడం లేదు. శాసనసభ సచివాలయం పదేపదే గుర్తు చేసినప్పటికీ అధికారుల్లో స్పందన కనిపించడం లేదు. ఇది తమ హక్కులకు భంగం కలిగించడమేనని ఎంఎల్‌ఏలు అంటున్నారు. ప్రశ్నోత్తరాల సమయంలో ఇచ్చిన జవాబులే కాకుండా కొన్ని ప్రశ్నలకు రాతపూర్వకంగా సమాధానాలు ఇవ్వాల్సిఉంటుంది. ఒక్కోసారి సమయాభావంతోనో ఇతర కారణాలతోనూ సమాధానాలు ఇచ్చినట్లుగానే (డీమ్డ్ టుబి ఆన్సర్డ్) భావిస్తూనే సభను వాయిదా వేస్తుంటారు. అటువంటి సమయంలోనూ సభ్యులకు జవాబులు అందచేయాల్సిఉంటుంది. అన్‌స్టార్‌డ్ ప్రశ్నలు, షార్ట్ నోటీస్ ప్రశ్నలు, రూల్ 74, రూల్ 344 కింద సభ్యులు అడిగిన ప్రశ్నలకు కూడా జవాబులు రావడం లేదు. కొత్త ప్రభుత్వం ఏర్పాటైన తరువాత 2019లో జరిగిన రెండో సమావేశాల నుంచి ఐదో విడత సమావేశాల వరకు మధ్యలో అనేక ప్రశ్నలకు సమాధానాలు రావాల్సి ఉందని శాసనసభ సచివాలయం ద్వారా తెలిసింది. ఇన్ని సంవత్సరాలుగా జవాబులు రాకపోవడాన్ని అసెంబ్లీ సచివాలయం కూడా తీవ్రంగానే భావిస్తోంది. ఈ నేపథ్యంలో తాజాగా రాష్ట్ర సాధారణ పరిపాలనశాఖకు అసెంబ్లీ అధికారులు లేఖ రాశారు. ఎక్కువ ప్రశ్నలు ఈ శాఖల నుండే... ఇందులో భాగంగా ఎక్కువ ప్రశ్నలు మున్సిపల్, నీటిపారుదలశాఖ, పాఠశాల విద్య, రెవెన్యూ వంటి శాఖల్లోనే ఉన్నట్లు తేలింది. శాసనసభ రెండో సెషన్‌లోనే 26 ప్రశ్నలకు సమాధానాలు ఇంకా రాలేదు. మూడో సెషన్‌లో ఒక్క మున్సిపల్ శాఖ నుంచే 24 సాధారణ ప్రశ్నలకు సమాధానాలు రాలేదు. రెవెన్యూ నుంచి 12, పాఠశాల విద్య నుంచి పది, నాలుగో సెషన్‌లో అటవీశాఖ, పౌరసరఫరాల శాఖల నుంచి ఆరేసి ప్రశ్నలకు, ఇరిగేషన్‌లో పది, పట్టణాభివృద్ధిలో 12, రెవెన్యూలో 13 ప్రశ్నలకు సమాధానాలు లేకుండా పోయాయి. ఐదో సెషన్‌లో కూడా అనేక ప్రశ్నలకు సమాధానాలు రాకపోగా, ఆరో సెషన్‌లో పౌరసరఫరాల నుంచి 8, పరిశ్రమల శాఖ నుంచి ఏడు, నీటి పారుదల శాఖ నుంచి తొమ్మిది, మున్సిపల్ శాఖ నుంచి 14, పంచాయితీరాజ్ శాఖ నుంచి తొమ్మిది, సాంఘిక సంక్షేమ శాఖ నుంచి పది ప్రశ్నలకు సమాధానాలు రాలేదు. మొత్తం ఆరు సెషన్లలో నక్షత్రేతర ప్రశ్నలు 31 ఇంకా సమాధానాలకు దూరంగా ఉన్నట్లు తెలిసింది. ఈ మొత్తం ప్రశ్నలకు సమాధానాలు పంపించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని, దీనిని అత్యవసర చర్యగా పరిగణించాలని శాసనసభ సచివాలయం కోరింది. శాసనసభలో ఎక్కువ శాతం సభ్యులు కొత్తగా ఎన్నికైన వారే ! వీరికి చర్చల్లో అవకాశం తక్కువగానే లభిస్తోంది. దీంతో నియోజకవర్గ సమస్యలను లేవనెత్తడానికి ప్రశ్నోత్తరాలనే వారు ఆశ్రయిస్తుంటారు. అక్కడ కూడా ఏళ్ల తరబడి జవాబులు రాకపోవడంతో వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. . ఇదే అంశాన్ని పలువురు శాసనసభ సచివాలయం దృష్టికి కూడా తీసుకువెళ్లినట్లు సమాచారం.

# రైతు మెడకు రుణ పాశం



సర్వే ప్రకారం ఎ.పి లో 49.6 శాతం రైతులకే బ్యాంకుల నుండి సంస్థాగతంగా రుణాలు అందుతున్నాయి. వ్యవసాయం చేసే సగం మంది అన్నదాతలకు బ్యాంక్ పరపతి మృగ్యం. ఇచ్చామంటున్నవీ ఎక్కువ రెన్యువల్స్. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ అప్రస్తుతమై పోయింది. సంస్థాగత పరపతిలో వాణిజ్య బ్యాంకుల నుండి అందుతున్నది 34.1 శాతం. దేశానికి అన్నం పెట్టేందుకు పంటలు పండించే రైతులకు బ్యాంకులు పెట్టుబడులు సమకూర్చకపోతే వారికి పైకం ఎలా అందుతుంది? గతి లేక వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. వడ్డీ వ్యాపారుల నుండి 31.1 శాతం మంది, సాధారణ వడ్డీ వ్యాపారుల నుండి 15.4 శాతం మంది అప్పు చేసి పంటలు సాగు చేస్తున్నారు. రైతుల స్థితిగతులపై జాతీయ గణాంక కార్యాలయం ఇటీవల విడుదల చేసిన 77వ రౌండ్ సర్వే వివరాలు అన్నదాతల వాస్తవ బతుకు చిత్రాన్ని ఆవిష్కరించాయి. దేశంలో వ్యవసాయ సంక్షోభం అంతకంతకూ తీవ్రమవుతుండగా ఆంధ్రప్రదేశ్‌లో ఆ తీవ్రత ఇంకా ఎక్కువగా ఉందని నేషనల్ శాంపిల్ సర్వే (ఎన్.ఎస్.ఎస్) ఫలితాలు ధ్రువీకరిస్తున్నాయి. సర్వే లెక్కలు 2018 చివరి నాటివి. అనంతరం ఆర్థిక మాంద్యం, కరోనా పెను విలయం రైతు జీవితాన్ని మరింత దుర్భలమొనర్చాయి. ఇప్పుడు సర్వే చేస్తే వచ్చే ఫలితాలను ఊహించడానికే భయమేస్తుంది. అందుబాటులోకి వచ్చిన తాజా గణాంకాల మేరకు మన రాష్ట్ర రైతన్న సగటు రుణం అక్షరాలా 2 లక్షల 45 వేల 554 రూపాయలు. దేశంలోని అన్ని రాష్ట్రాల్లోకెల్లా మనదే అగ్ర స్థానం. జాతీయ సగటు రుణం రూ.74,121. జాతీయ రుణం కంటే ఎ.పి రుణం 221 శాతం అధికం. అలాగని జాతీయ స్థాయిలో రైతు పరిస్థితి బాగుందనుకోవడం పొరపాటు. 2013 నాటికి జాతీయంగా రైతు సగటు అప్పు రూ.47 వేలు కాగా ఇప్పుడది రూ.74 వేలు. అప్పటి కంటే ఇప్పుడు 57 శాతం పెరిగింది. ఎక్కువ కుటుంబాలపై అప్పు లున్న రాష్ట్రాల్లోనూ ఎ.పి దే మొదటి స్థానం. మన రాష్ట్రం లోగల రైతు కుటుంబాల్లో 93.2 శాతం అప్పుల ఊబిలో కూరుకుపోయాయి. మన దగ్గర కోటి మంది రైతులుండగా 93.2 లక్షల మందిని రుణ పాశం వెంటాడుతోంది. అదే జాతీయ స్థాయిలో 50.2 శాతం వ్యవసాయ కుటుంబాలు రుణగ్రస్తమయ్యాయి. ఎన్.ఎస్.ఎస్ లో మచ్చుకే వివరాల సేకరణ జరుగుతుంది. పూర్తి స్థాయిలో ఇంటింటి సర్వే చేపడితే రైతు అప్పుల వెతలు ఇంకా దారుణంగా ఉంటాయి. వేళ్ల మీద లెక్కించగలిగేలా ఎగువ ధనిక, భూస్వాములు, కార్పొరేట్ వ్యవసాయదారులు మాత్రమే అప్పుల బయట ఉంటారు.

**సగం మందికి బ్యాంక్ రుణాల్లేవు**

సర్వే ప్రకారం ఎ.పి లో 49.6 శాతం రైతులకే బ్యాంకుల నుండి సంస్థాగతంగా రుణాలు అందుతున్నాయి. వ్యవసాయం చేసే సగం మంది అన్నదాతలకు బ్యాంక్ పరపతి మృగ్యం. ఇచ్చామంటున్నవీ ఎక్కువ రెన్యువల్స్. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ అప్రస్తుతమై పోయింది. సంస్థాగత పరపతిలో వాణిజ్య బ్యాంకుల నుండి అందుతున్నది 34.1 శాతం. దేశానికి అన్నం పెట్టేందుకు పంటలు పండించే రైతులకు బ్యాంకులు పెట్టుబడులు సమకూర్చకపోతే వారికి పైకం ఎలా అందుతుంది? గతి లేక వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. ఈ విషయాన్నే సర్వే కుండ బద్దలు కొట్టింది. వడ్డీ వ్యాపారుల నుండి 31.1 శాతం మంది, సాధారణ వడ్డీ వ్యాపారుల నుండి 15.4 శాతం మంది అప్పు చేసి పంటలు సాగు చేస్తున్నారు.

వడ్డీ వ్యాపారులంటే రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు, పురుగుమందులను విక్రయించే వ్యాపారులు. వడ్డీపై ఉత్పాదకాలను రైతులకు అందించి వడ్డీ వేసుకుంటారు. పంటలు అమ్మగానే ముందు వారికే బకాయిలు చెల్లించాలి. గ్రామాల్లో ఈ పద్ధతి వ్యవస్థీకృతం అయినందు వల్లనే వైసిపి సర్కారు ప్రారంభించిన రైతు భరోసా కేంద్రాల (ఆర్‌బికె) వైపు రైతులు కన్నెత్తి చూడట్లేదు. సాధారణ వడ్డీ వ్యాపారులంటే అచ్చంగా చేతికి నగదు బదులిచ్చే బాపతు. వీరి వడ్డీ చాలా అధికంగా ఉంటుంది. నూటికి రూ.5-10 వసూలు చేస్తారు. రైతులకు సంస్థాగత పరపతి అందని కారణంగానే గ్రామాల్లో వడ్డీ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా విలసిల్లుతోంది. ఇప్పుడు మైక్రో ఫైనాన్స్ సంస్థలు సైతం రైతులనే లక్ష్యంగా చేసుకొని అధిక వడ్డీలకు రుణాలిస్తున్నాయి. సర్వేలోనే మరో కీలక అంశం ఉంది. రైతులు చేస్తున్న అప్పుల్లో 60.3 శాతం కేవలం సాగుకే వెచ్చిస్తున్నారు. తతిమ్మా రుణాలను గృహ నిర్మాణం, విద్య, వైద్యం, వివాహాలు, శుభ కార్యాలు, ఇతరత్రా వ్యాప కాలకు వ్యయం చేస్తున్నారు. రైతు అప్పులంటే సాధా రణంగా వచ్చే చర్చ వారు సేద్యం కోసం చేసే ఖర్చులనే ఆ కోవలో వేస్తారు. ప్రభుత్వాలు సైతం అదే చెబుతుంది. రైతులూ మామూలు మనుషులే. సమాజంలో బతికే వారికి వచ్చే అవసరాలన్నీ వారికీ ఉంటాయి. రైతు అప్పులను సేద్యానికి కాకుండా ఆస్పత్రి, పిల్లల చదువులకు వాడకూడదనడం రైతుల పట్ల ఒక విధమైన వ్యతిరేకతను నూరి పోయడమే.

**రోజుకు రూ.277**

రైతుల ఆదాయాలపై జాతీయ గణాంక కార్యాలయం 2018-19 నాటికి ఉన్న పరిస్థితులపై సిచ్యువేషన్ అసెస్‌మెంట్ సర్వే (ఎస్.ఎ.ఎస్) గణాం కాలను మొన్ననే విడుదల చేసింది. జాతీయ స్థాయిలో రైతు కుటుంబం మొత్తం నెలవారీ పొందుతున్న ఆదా యం రూ.10,218 మాత్రమే. అన్నీ పోను దక్కుతున్నది రూ.8,337. ఒక రోజుకు పడుతున్నది రూ.277. మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టం కింద పనులు చేసే కూలీకి ఇచ్చే సగటు కూలి డబ్బులకు దాదాపు సమానం. ఇది కూడా రైతు కుటుంబానికి అన్ని వనరుల నుండి సమకూరుతున్నది. ఎ.పి రైతుకు సైతం ఇంచుమించు ఇంత ఆదాయమే లభిస్తోందని ఎస్.ఎ.ఎస్ సర్వే పేర్కొంది. ఆరుగాలం కష్టించి పని చేసే రైతులకు ఇంత తక్కువ ఆదాయం వస్తున్నందునే వారి కుటుంబాలు అప్పుల్లో కూరుకుపోతున్నాయి. రైతులు రుణగ్రస్తం కావడానికి ప్రభుత్వ విధానాలే కారణం. మొదటిది సంస్థాగత పరపతి తగ్గిపోవడం. రెండవది వ్యవసాయ ఉత్పాదకాల ధరలు పెరగడం. మూడవది పంటలకు గిట్టుబాటు ధరల్లేమి. నాలుగు విపత్తుల సమయంలో పంటల బీమా వంటి సదుపాయాలు దరి చేరకపోవడం. ఈ నాలుగు ప్రధాన అంశాలపై స్వామినాథన్, జయతీ ఘోష్, కోనేరు రంగారావు, రాధాకృష్ణ వంటి కమిషన్లు అధ్యయనం చేసి సిఫారసులు చేశాయి. ఆ కమిషన్లను ప్రభుత్వాలే వేసినా అవి ఇచ్చిన సూచనలను మాత్రం బుట్టదాఖలు చేశాయి. ఎ.పి లోనే రైతుల రుణ కుటుంబాలు, సగటు రుణం దేశంలోకెల్ల గరిష్ట స్థాయిలో ఉండటానికి ప్రధాన కారణం కౌలు వ్యవసాయం. రాష్ట్రంలో 32 లక్షల మంది కౌలు రైతులున్నారని 2015లో రాధాకృష్ణ కమిషన్ పేర్కొంది. వాస్తవ సాగుదారులైన కౌలు రైతులకు సంస్థాగత పరపతి, ఇతర ప్రభుత్వ పథకాలను విధిగా వర్తింపజేయాలంది. ఇప్పటికీ అతీగతీ లేదు. ప్రస్తుత వైసిపి ప్రభుత్వం తెచ్చిన నూతన చట్టం గతంలో ఉన్న అరకొర సదుపాయాలనూ దూరం చేసింది. 2020-21లో బ్యాంకులు రూ.94,629 కోట్ల పంట రుణాలిస్తే మొత్తంగా కౌలు రైతులకు ఇచ్చిన రుణాలు 79 వేల మందికి రూ.394 కోట్లు. భూమిని నమ్ముకొని వ్యవసాయం చేసే కౌలు రైతుల 'పరపతి' ఇంత అధమస్తంగా ఉంది కనుకనే అత్యధిక రైతు కుటుంబాలు వడ్డీ వ్యాపారుల బారినపడి అప్పుల ఊబిలో కూరుకుపోతున్నాయి. ఆత్మహత్యలకూ అప్పులే కారణం. ప్రభుత్వం ఎంత దాచిపెట్టినా ఏడాదికి వందల్లో రైతులు బలవంతంగా ప్రాణాలు తీసుకుంటున్నారు. ఆత్మహత్యల్లో కౌలు రైతులవే అత్యధికం.

**విధానాలు మారాలి**

రైతులకు 2004 నుండి ఎ.పి లో ఉచిత విద్యుత్ అమలవుతోంది. పావలా వడ్డీకే రుణాలన్నారు. 2013 నుండి సున్నా వడ్డీ అన్నారు. 2014 నుండి 2019 మధ్య రైతులకు రుణ మాఫీ అన్నారు. 2019 నుండి కేంద్ర స్థాయిలో పి.ఎం. కిసాన్ సాయం, రాష్ట్రంలో రైతు భరోసా అమలు చేస్తున్నారు. ఇవేవీ రైతుల జీవితాలను మార్చలేదు సరికదా మరింతగా అప్పుల్లోకి కూరుకుపోతున్నారు. ఉచిత విద్యుత్‌ను మినహాయిస్తే మిగతా పథకాలన్నీ కంటి తుడుపుకే. ఇప్పుడు ఉచిత విద్యుత్‌కూ దానికీ మీటర్ల ముసుగులో ఎసరు పెట్టారు. కఠిన నిబంధనల వలన రైతులకు పావలా వడ్డీ, సున్నా వడ్డీ వచ్చేది చాలా తక్కువ. రుణ మాఫీ అందరికీ అని చెప్పి తర్వాత పంట రుణాలేనని, గోల్డ్ లోన్లను మూడవ ప్రాధాన్యతగా చేసి, మాఫీని లక్షన్నరకే పరిమితం చేసి, చివరికి రూ.24,500 కోట్ల మాఫీ అని, అధికారం కోల్పోయే నాటికి రూ.15 వేల కోట్లిచ్చింది టిడిపి ప్రభుత్వం. రూ.9 వేల కోట్లు బకాయి పెట్టగా వాటితో సంబంధం లేదంది తర్వాత వచ్చిన వైసిపి ప్రభుత్వం. వైసిపి సర్కారు సైతం తక్కువ తినలేదు.

# నాశబోయిన నరసింహ నాన కు గ్లోబెల్ హ్యూమన్ ఎక్సలెన్సీ అవార్డ్ ప్రదానం

యాదాద్రి అక్టోబర్ 24 వలిగొండ ప్రజా పాలన ప్రతినిధి :వేములకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య పర్యవేక్షకులుగా విధులు నిర్వహిస్తున్న కవి,రచయిత నాశబోయిన నరసింహ నాన అంతర్జాతీయ మానవ ప్రతిభా పురస్కారం గ్లోబెల్ హ్యూమన్ ఎక్సలెన్సీ అవార్డ్ అందుకున్నారు. ఐక్యరాజ్య సమితి దినోత్సవ వేడుకలు పురస్కరించుకొని సంస్కృతీ దౌత్య సంబంధాల అంతర్జాతీయ కమీషన్, వేఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం హైద్రాబాద్ లోని తెలంగాణ సారస్వత పరిషత్ ప్రాంగణంలో జరిగిన అంతర్జాతీయ ఐక్యరాజ్య సమితి దినోత్సవ వేడుకలు 2021 కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా విచ్చేసిన శ్రీలంక దేశానికి చెందిన మదర్ కేర్ గ్లోబల్ ఫౌండేషన్ ఆసియా చైర్మన్ డా.తర్మలింగం తారేసన న్,ఈస్ట్ ఆఫ్రికాకు చెందిన డా.అవనింద్రకుమార్,మెడిక్రైడెతోస్ ప్రై.లి.టెడ్ చైర్మన్ డా.శివరామ కృష్ణన్,డిప్యూటీ సిఇఓ,ఖమ్మం కే.చంద్రశేఖర్,సంస్కృతీ దౌత్య సంబంధాల అంతర్జాతీయ కమీషన్ ఐ సి సి డి ఆర్ సెక్రెటరీ జనరల్, అంబాసిడర్ డా.ఏలూరి శ్రీనివాసరావు,వే ఫౌండేషన్ ఫౌండర్ డా.పైడి



అంకయ్య మొదలైన ప్రముఖుల చేతుల మీదుగా నరసింహకు గ్లోబెల్ హ్యూమన్ ఎక్సలెన్సీ అవార్డ్ ప్రదానం చేసి మెమెంటో, సర్టిఫికెట్,శాలువాతో ఘనంగా సన్మానించారు. నల్గొండ జిల్లా చిట్యాలకు చెందిన నరసింహ ప్రస్తుతం వేములకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం యాదాద్రి జిల్లాలో ఆరోగ్య పర్యవేక్షకుడిగా విధులు నిర్వహిస్తున్నారు.నరసింహ గత రెండు దశాబ్దాల కాలం నుంచి వైద్య ఆరోగ్యరంగంలో క్షేత్రస్థాయిలో వివిధ ఆరోగ్య అవగాహన కార్యక్రమాలతో గ్రామీణ ప్రజలను చైతన్యపరచడం ద్వారా వృత్తిలో నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ వివిధ వైద్యారోగ్య విశిష్ట సేవలకు గుర్తింపుగా,ప్రవృత్తి పరంగా సమాజ హితం కాంక్షించే సామాజిక చైతన్యం కలిగించే సాహితీ సేవలకు గాను తనకు ఈ పురస్కారం ప్రదానం చేసినట్లు చెప్పారు.మరో వైపు అంతర్జాతీయ మానవప్రతిభా పురస్కారం అందుకోవడం పట్ల వైద్యారోగ్యశాఖ సహోద్యోగులు, సాహితీ మిత్రులు,బంధువులు ప్రత్యేక శుభాభినందనలు తెలిపారు.

## సారంగాపూర్ మండల్ ఏపీఎం వచ్చిన నుండి వివాదాస్పదమే...



సారంగాపూర్, అక్టోబర్ 23 (ప్రజాపాలన ప్రతినిధి): సారంగాపూర్ మండల్ పరిషత్ అధ్యక్షురాలు కోల జమున ఎంపీపీ కార్యాలయంలో శనివారం రోజున విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ ఏపీఎం రజిత సారంగాపూర్ వచ్చినప్పటినుండి వివాదాస్పదమే అని మండిపడ్డారు. సరిగా విధులకు హాజరు కాకుండ ఉన్నతాధికారులకు సమాచారం తెలుపకుండ కనీసం ఎంపీపీకి ఎంపీడీవో కు సమాచారం గాని మండల పరిషత్ సమావేశాలకు హాజరు కాకుండ ప్రోటోకాల్ పాటించకుండ సెర్ప్ కార్యాలయానికి హాజరు కాకుండ గ్రామ సమాఖ్య సిఏలను ఇష్టం వచ్చిన పదజాలంతో దూషిస్తున్నట్లు వ్యవహరిస్తున్నారని ఎంపీపీ ఆవేదన వ్యక్తం చేశారు. గత కొన్ని రోజుల క్రితం బట్టపల్లి గ్రామంలో నిర్వహించిన సర్వేకు దళిత మహిళా అనే ఉద్దేశ్యంతో కనీసం సమాచారం తెలుపకుండ అవమాన పరిచడంతో ఉన్నతాధికారులకు నాయకులకు మహిళా సర్పంచ్ ఫిర్యాదు కూడ చేశారని అయిన ఆమె లోపల మార్పు రావట్లేదని జిల్లా కలెక్టర్ డిఆర్డిఏ పీడీకి పిర్యాదు చేస్తామని ఎంపీపీ జమున తెలియజేశారు.

## ఎమ్మెల్యేని కలిసిన కోలాట బృందం సభ్యులు



యాదాద్రి అక్టోబర్ 24 వలిగొండ ప్రజాపాలన ప్రతినిది మండల పరిధిలోని జంగారెడ్డి పల్లి గ్రామానికి చెందిన కోలాట బృందం సభ్యులు ఆదివారం స్థానిక శాసనసభ్యులు పైళ్ల శేఖర్ రెడ్డిని తన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.అనంతరం కోలాట బృందం సభ్యులకు కోలాటం పరికరాలకు పూర్తి ఆర్థిక సహకారం అందిస్తానని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షులు శివరాత్రి శ్రీనివాస్,మండల యూత్ ఉపాధ్యక్షులు ఆలకుంట రాజు,శివరాత్రి శ్రీనివాస్,ఆలకుంట భాస్కర్, దేశ పాక ఉప్పలయ్య, నాగరాజు,కోలాటం బృందం రజిత,నిర్మల,మంజుల, వెంకటమ్మ,లింగమ్మ,సువర్ణ, లక్ష్మి,అనూష,మంజుల తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీలో బారీగా చేరికలు

### కండువా కప్పి పార్టీలో ఆహ్వానించిన మాజీ ఎమ్మెల్సీ



మంచిర్యాల బ్యూరో, అక్టోబర్ 24, ప్రజాపాలన : రాబోయే ఎన్నికల్లో గెలుపే లక్ష్యం గా మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేంసాగర్ రావు నియోజకవర్గ పరిధిలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేస్తూ కార్యకర్తలను చైతన్య పరుస్తున్నారు. ఈ నేపద్యంలో మంచిర్యాల లోని ఏసీసీ మరియు ప్రేమ్ సాగర్ రావు గారి నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీలో భారీగా చేరికలు జరిగాయి. మంచిర్యాల పురపాలక సంఘ పరిధిలోని 11వ వార్డు 19వ వార్డులకు చెందిన గుమ్ముల కృష్ణంరాజు, నోరు చంద్రుడు, జంగిలి రవేష్, ఉట్నూరి సతీష్, రియజుద్దీన్ , టిఆర్ఎస్,వివిధ పార్టీలకు చెందిన 300మంది నేతలు కార్యకర్తలు వార్డు కౌన్సిలర్ జోగుల సదానందం-శ్రీలత ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్ సాగర్ రావు వారికి కాంగ్రెస్ కాండువ కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మంచిర్యాలలోని తాపీ మేస్త్రి సభ్యులు కాలేజ్ రోడ్డు,ఏసీసీ లోని వివిధ పార్టీలకు చెందిన నాయకులు కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలోకి చేరేందుకు ముందుకు రాగా ప్రేమ్ సాగర్ రావు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. మంచిర్యాల నియోజకవర్గం లోని వివిధ మండలాలకు చెందిన సీనియర్ టిఆర్ఎస్ కార్యకర్తలు ఎమ్మెల్యేపై అసంతృప్తితో కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు ఇప్పటికే రంగం సిద్ధం చేసుకున్నారు. కాగా వారిని బుజ్జగించేందుకు ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు స్వయంగా రంగంలోకి దిగారు. అయినప్పటికీ కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు నాయకులు, కార్యకర్తలు సంసిద్ధులు అవుతున్నారు . పార్టీలో సుదీర్ఘకాలం అంకితభావంతో పని చేసిన వారికి గుర్తింపు ఇవ్వకుండా అడ్డుకోవడాన్ని వారు ఖండించారు. ఈ సందర్భంగా ప్రేమ్ సాగర్ రావు మాట్లాడుతూ డబ్బు సంపాదించేందుకు రాజకీయాల్లోకి రావడంలేదని ప్రజాసేవ చేయడానికి వచ్చానని తెలిపారు. పార్టీలకు భిన్నంగా ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తానని ఆయన స్పష్టం చేశారు. ఇంతకాలం అభివృద్ధికి నేర్చుకోకుండా సంక్షేమ ఫలాలను అందుకోలేక నరకయాతన పడుతు న్నారని ఆయన తెలిపారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన అనంతరం ప్రజల మౌలిక సదుపాయాల కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తానని ప్రేమ్ సాగర్ రావు స్పష్టం చేశారు.ఇప్పటికే మంచిర్యాల నియజకవర్గంలో అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నామని ఎమ్మెల్యే గా అవకాశం వస్తే ఈ నియోజకవర్గానికి మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తానని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో టీపీసీసీ మాజీ అధికార ప్రతినిధి చిట్ల సత్యనారాయణ,మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ఉప్పలయ్య ,పట్టణ అధ్యక్షులు అంకం నరేష్ ,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతి, మున్సిపల్ డిప్యూటి ఫ్లోర్ లీడర్ సంజీవ్,మజీద్,రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి అర్కల హేమలత, ఓబీసీ సెల్ జిల్లా చైర్మన్ బందరి సుధాకర్,పట్టణ మహిళ అధ్యక్షురాలు హేమలత, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు సళ్ళ మహేష్, నాయకులు తాజ్, శ్రీరాముల మల్లేష్, పుదరి ప్రభాకర్,శ్రీపతి, తిరుపతి, రామ్మూర్తి,శ్రీపతి మల్లేష్,శ్రీను, సూరం సతీష్,విజయ్,పవన్ షకీల్,మహిళ నాయకురాళ్లు శైలజ, స్రవంతి, తదితరు లు పాల్గొన్నారు.



## గంజాయి విక్రేతలు అరెస్ట్: డిఎస్పీ ప్రకాష్ కుమార్



జగిత్యాల, అక్టోబర్ 24 (ప్రజాపాలన ప్రతినిధి): జగిత్యాల జిల్లా పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇద్దరు వ్యక్తులు గంజాయి విక్రయిస్తుండగా పోలీసులు అరెస్టు చేశారు. జిల్లా ఎస్పి సింధు శర్మ ఆదేశాల మేరకు పట్టణ పోలీసులు శనివారం రోజున ప్రత్యేక బృందాల ద్వారాఅరుముళ్ల సాయి కుమార్ జగిత్యాల బిట్ బజారుకు చెందిన మడారి చందు అనే వ్యక్తి ఆసిఫాబాద్ జిల్లా లింగాపూర్ గ్రామానికి చెందిన వ్యక్తి వద్ద గంజాయి సాగుచేస్తున్న మొక్కలను మరియు మూడు బైకులను స్వాధీనం చేసుకొని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్లు డిఎస్పి ప్రకాష్ కుమార్ తెలిపారు. డీఎస్పీ వెంట పట్టణ సీఐ కిషోర్ కుమార్ పోలీసులు ఉన్నారు.

## బాధ్యతలు స్వీకరించిన టౌన్ ప్లానింగ్ అధికారి శ్యామ్ సుందర్



జగిత్యాల, (ప్రజాపాలన ప్రతినిధి): జగిత్యాల మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారిగా శనివారం రోజున బి. శ్యామ్ సుందర్ నూతనంగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం పట్టణ కౌన్సిలర్స్ పిట్ట ధర్మరాజు కూసరి అనిల్ కుమార్ మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

## భారత్ నీతిద డిజిటల్ హిందూ కాంక్లేవ్ కరీంనగర్ సమావేశం



కొడిమ్యాల, అక్టోబర్ 24 (ప్రజాపాలన ప్రతినిధి): పోలసాని మురళీధర్ రావ్ మధ్యప్రదేశ్ భాజాపా ఇంచార్జ్ ఆధ్వర్యంలో నిర్వహించిన భారత్ నీతి ద డిజిటల్ హిందూ కాంక్లేవ్ కరినగరం సమావేశానికి లింగంపెల్లి శంకర్ రాష్ట్ర భాజాపా నాయకులు మరియు కోడిమ్యాల మండల భాజపా సీనియర్ నాయకులు అక్కపెల్లి రవీందర్, బూస గంగాధర్, వంగల శ్రీనివాస్ చారి, చెన్న దేవేందర్ భైరి కార్తీక్, బండ లింగారెడ్డి, బండ నర్సింహ రెడ్డి పాల్గొన్నారు.ఈ కార్యక్రమం సందర్భంగా మురళీధర్ రావ్ గారిని మరియు రాధామనోహర్ స్వామీ గారిని కోడిమ్యాల భాజపా సీనియర్ నాయకులు సన్మానించడం జరిగింది.

## గాంధీనగర్లో రూ.49 లక్షలతో సీసీ రోడ్డు, డ్రైనేజీల నిర్మాణం



మేడిపల్లి, అక్టోబర్24 (ప్రజాపాలన ప్రతినిధి) :ఉప్పల్ డివిజన్లోని గాంధీనగర్లో జరుగుతున్న అభివృద్ధి పనులను స్థానిక కార్పొరేటర్ రజితపరమేశ్వర్ రెడ్డి పరిశీలించారు.గాంధీనగర్లో రూ. 49 లక్షలతో సీసీ రోడ్డు, డ్రైనేజీల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఆదివారం రజితపరమేశ్వర్ ఏఈ వసంత గారి తో కలిసి పనులను పరిశీలించారు.సకాలంలో పనులను పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని అధికారులకు రజితపరమేశ్వర్ రెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో బాకారం లక్ష్మణ్, సిడి వెంకట్ (గాంధీ నగర్ అధ్యక్షులు) సుక్క జీవన్, కుమార్ ,సుక్క కిరణ్ ,ఏర దాస్ ,సిల్వర్ నర్సింహా ,శ్రీనివాస్ ,బండారి జగన్ ,మేకల కృష్ణ ,తోకట రాజు ,బద్రి బ్యాండ్ మహేష్ ,బాబు,ప్రేమ్ ,రాజు ,నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ అధికారుల సమస్యల పరిష్కార లక్ష్యమే ట్రెసా

### రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతమ్ కుమార్



వికారాబాద్ బ్యూరో 24 అక్టోబర్ ప్రజాపాలన : రెవెన్యూ అధికారుల సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా ట్రెసా (తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ ) ఏర్పడిందని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతమ్ కుమార్ అన్నారు. ఆదివారం వికారాబాద్ జిల్లా కేంద్రంలో ఎంపిడిఓ కార్యాలయంలోని రవీంద్ర మండపంలో ఎన్నికల అధికారిగా బాణాల రాంరెడ్డి, అతిథులుగా వి.రామకృష్ణారెడ్డి, పి.సుధాకర్, పి.శ్రీనివాస్ రెడ్డి సమక్షంలో వికారాబాద్ జిల్లా ట్రెసా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి అధికారి విధులను సక్రమంగా నిర్వహిస్తూ ఆదర్శంగా నిలవాలని హితవు పలికారు. ప్రభుత్వ విధి విధానాలలో నిర్లక్ష్యం వహించరాదని సూచించారు. ప్రతి అధికారి ప్రజల సంక్షేమం దృష్ట్యా విధులు నిర్వహించాలని ఆకాంక్షించారు. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిలా ఉండాలని స్పష్టం చ్టేశారు. వికారాబాద్ జిల్లా ట్రెసా అధ్యక్షుడు బి. కృష్ణ మాట్లాడుతూ జిల్లా అధ్యక్ష పదవి బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా రెవెన్యూరీరీ అధికారుల సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా అహర్నిశలు కృషి చేస్తానని భరోస్సా కల్పించారు. అధికారులకు ఏ సమస్య వచ్చినా ముందుండి పోరాడతామని వివరించారు. వికారాబాద్ జిల్లా ట్రెసా అధ్యక్షునిగా బి కృష్ణయ్య, అసోసియేట్ అధ్యక్షులుగా ఆనందం, బాల్ రాజ్, వైస్ ప్రెసిడెంట్ గా తులసి రాం, నర్సింహారెడ్డి, వహీద్ ఖాతుమ్ ఖాజా పాషాలను నియమించారు. జనరల్ సెక్రటరీ విజయేందర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీనివాస్ రెడ్డి, విజయ్, జాయింట్ సెక్రటరీ రవీందర్, అశోక్, భారతమ్మ, స్పోర్ట్స్ సెక్రటరీ సురేష్, కోశాధికారి మహేష్ గౌడ్, ఈసీ మెంబర్స్ శ్రీనివాస్ రావు, మానిక్ రావు, మోహన్, నరేష్ కుమార్, రాములు, భాగ్యలక్ష్మి, శశికళ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ....రెవెన్యూ సమస్యలు పరిష్కరించేందుకు తప్పక కృషి చేస్తామన్నారు. తమ హక్కులు కాలరాస్తే ఊరుకునేది లేదని తెలిపారు. రెవెన్యూ ఉద్యోగులకు అనేక సమస్యలతో సతమతం అవుతున్నారని అన్నారు. విఆర్వోలను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని,వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.ఇష్టం వచ్చిన విధులకు ప్రభుత్వం రెవెన్యూ ఉద్యోగులను వాడుకోవడం జరుగుతుందన్నారు. ఉద్యోగులను ఒత్తిడి నుంచి తగ్గించాలని, ఉద్యోగుల శ్రమ దోపిడీ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఉద్యోగులు ఉన్నారు.

## ప్రజ్వల హాస్పిటల్ ను ప్రారంభించిన మేయర్ జక్కా వెంకట్ రెడ్డి



మేడిపల్లి, అక్టోబర్24 (ప్రజాపాలన ప్రతినిధి) పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 24వ డివిజన్ ప్రశాంత్ నగర్ రోడ్ నంబర్ 6లో ఎం కన్వెన్షన్ ఎదురుగా ప్రజ్వల హాస్పిటల్ ను మేయర్ జక్కా వెంకట్ రెడ్డి, డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్, కార్పొరేటర్లు అనంత రెడ్డి, భీంరెడ్డి నవీన్ రెడ్డి, హరిశంకర్ రెడ్డి, అమర్ సింగ్, సింగిరెడ్డి పద్మా రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై హాస్పిటల్లోని వివిధ డిపార్మెంటల్ లను ప్రారంభించారు. ఈసందర్భంగా రూ.10 రూపాయలకె ఓపి సేవలు ప్రారంభించారు. అనంతరం మేయర్ జక్కా వెంకట్ రెడ్డి మాట్లాడుతూ పేద, మధ్యతరగతి ప్రజలకు అతి తక్కువ ఖర్చులో మెరుగైన వైద్యంఅందిస్తున్నా డాక్టర్ విక్టర్ ఇమాన్యుల్ అభినందించారు. కరోనా విజృంభిస్తున్న సమయంలో మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన ఐసోలేషన్ సెంటర్లో కరోనా రోగులకు వైద్యం అందించి ఎంతోమందికి న్యాయం చేశారని తెలిపారు. ప్రజ్వల హాస్పిటల్ లో 15 పడకలతో అన్ని రకాల వైద్య సదుపాయాలతో పీర్జాదిగూడ కార్పొరేషన్ ప్రజలకు అందుబాటులోకి తెచ్చినందుకు కార్పొరేషన్ నుంచి సహాయ,సహకారాలు అందజేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, వైద్య సిబ్బంది కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్ డిఎస్ఎల్ మాల్లో వైట్ అండ్ వైట్ షూటింగ్ శట్టింగ్ షాప్పు ప్రారంభించిన కార్పొరేటర్ యుగేంధర్ రెడ్డి



మేడిపల్లి, అక్టోబర్24 (ప్రజాపాలన ప్రతినిధి) ఉప్పల్-రామంతాపూర్ ప్రధాన రహదారిలో ఉన్న డిఎస్ఎల్ మాల్లో నూతనంగా ఏర్పాటు చేసిన వైట్ అండ్ వైట్ షూటింగ్ శట్టింగ్ షాప్ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ 11వ డివిజన్ కార్పొరేటర్ మద్ది యుగేంధర్ రెడ్డి పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ వినియోగదారులకు నాణ్యమైన వస్త్రాలను విక్రయించాలని షాప్ యజమానులకు సూచించారు. ఈ కార్యక్రమంలో షాప్ యజమానులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## షాకింగ్ నిజాన్ని చెప్పిన ఛార్మీ



ఒకటి కాదు రెండు కాదు బోలెడన్ని వివాదాలకు కేరాఫ్ అడ్రస్ గా నిలిచే హీరోయిన్ల పేర్లలో ఛార్మీ కౌర్ పేరు వినిపిస్తూ ఉంటుంది. టాలీవుడ్ ను షేక్ చేసిన డ్రగ్స్ కేసు మొదలుకొని ఆమె వ్యక్తిగత జీవితానికి సంబంధించి వచ్చే పుకార్లకు అంతేపొంతు ఉండదు. అయినప్పటికీ వాటిని ఎదుర్కొంటూ.. మరింత బలంగా తయారవుతూ ఎప్పటికప్పుడు తనను తాను మార్చుకోవటం.. సరికొత్తగా ప్రజెంట్ చేయటంలో ఆమె ముందుంటారు. కొన్నేళ్లుగా నటనకు దూరంగా ఉంటున్న ఆమె.. పూరీ కనెక్ట్ పేరుతో ఏర్పాటు చేసిన నిర్మాణ సంస్థలో ఆమె భాగస్వామ్యం అయ్యారు. ఒకప్పుడు హీరోయిన్ గా ఉన్న ఆమె ఇప్పుడు నిర్మాతగా బాధ్యతల బరువుల్ని మోస్తున్నారు. తాజాగా రొమాంటిక్.. ఇండస్ట్రీలో హాట్ టాపిక్ గా మారిన 'లైగర్' మూవీలకు నిర్మాతగా వ్యవహరిస్తున్న ఆమె.. తాజాగా ఒక ప్రత్యేక ఇంటర్వ్యూను ఇచ్చారు. ఇందులో ఆమె షాకింగ్ నిజాన్ని చెప్పారు. ఒకప్పుడు హీరోయిన్ అయినా.. ఇప్పుడు నిర్మాతగా మారిన తర్వాత గాడిద చాకిరి చేయాల్సి వస్తోందన్నారు. నటన నిర్మాణం రెండు ఇష్టమే అయినా.. ఈ రెండింటికి అసలు పోలికే లేదన్నారు. మహీరోయిన్ గా చేసే వేళలో కంఫర్ట్ ఎక్కువగా ఉండేదని.. కేవలం ఫిట్ నెస్.. బ్యూటీ మీద ఫోకస్ చేస్తే సరిపోయేదని.. నిర్మాతగా మాత్రం అందరి కంఫర్ట్ చూడాల్సిన బాధ్యత ఉంటుందన్నారు. సినిమా మొదలైనప్పటి నుంచి పూర్తి అయ్యే వరకు గాడిద చాకిరీ చేయాలని.. రోజంతా కష్టపడాలన్నారు. ఇప్పటికి తనకు వారానికి రెండు.. మూడు ఆఫర్లు వస్తుంటాయని.. నటించమని అడుగుతారని చెప్పారు. అయితే.. తానిప్పుడు నిర్మాణ రంగంలో ఉన్న నేపథ్యంలో నటించే అవకాశం లేదన్నారు. "ఇక ఎప్పటికి నటించలేనేమో" అంటూ షాకింగ్ వ్యాఖ్య చేయటం గమనార్హం.

## నా కెరియర్లోనే బెస్ట్ మూవీ ఇది: రీతూ వర్మ



ఫ్యామిలీ ఎంటర్టైనర్ జోనర్లో నడిచే సినిమాలకు ఎప్పుడూ కూడా ఆదరణ ఎక్కువగా ఉంటుంది. ఫ్యామిలీ ఆడియన్స్ థియేటర్లకు వచ్చినప్పుడే ఒక సినిమాకి విజయాన్ని సాధించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. అలా ఫ్యామిలీ ఎంటర్టైనర్ ప్రేక్షకుల ముందుకు రావడానికి 'వరుడు కావలెను' సినిమా రెడీ అవుతోంది. సితార ఎంటర్టైన్మెంట్ బ్యానర్ పై నిర్మితమైన ఈ సినిమా ఈ నెల 29వ తేదీన థియేటర్లకు రానుంది. ఈ నేపథ్యంలో నిన్న రాత్రి హైదరాబాద్ లో ఈ సినిమాకి సంబంధించిన 'సంగీత్'ను నిర్వహించారు. ఈ సినిమాలో కథానాయికగా అలరించిన రీతూ వర్మ మాట్లాడింది. "ఈ సినిమాలో నాకు ఇంతమంచి అవకాశం ఇచ్చినందుకు ముందుగా నిర్మాతలకు థ్యాంక్స్ చెబుతున్నాను. ఈ సినిమా అంతా కూడా ప్రేమ .. పెళ్లి .. ఫ్యామిలీ ఎమోషన్స్ చుట్టూ తిరుగుతుంది. అందువలన ఆడియన్స్ కి వెంటనే కనెక్ట్ అవుతుంది. ఇది నా కెరియర్లోనే బెస్ట్ మూవీ అవుతుంది. దర్శకురాలు లక్ష్మీసౌజన్య ఈ సినిమాను ఎంతో అందంగా తీర్చిదిద్దారు. ఒక ఫీమేల్ డైరెక్టర్ గా ఆమెను చూడలేము. ఈ సినిమా కోసం ఆమె అంతగా కష్టపడ్డారు. ఆమె కష్టానికి తగిన సక్సెస్ లభిస్తుందనే నమ్మకం నాకు ఉంది. ఇక నాగశౌర్య విషయానికి వస్తే ఆయన సహకారం వల్లనే నేను నా పాత్రను మరింత బాగా చేయగలిగాను. ఇక ఈ ఫంక్షన్ కి చీఫ్ గెస్టుగా పూజ రావడం నాకు మరింత సంతోషాన్ని కలిగించిన విషయం. చీఫ్ గెస్టుగా ఒక హీరోయిన్ ను పిలవడం చాలా రేర్. అలాంటి అవకాశం పూజకి దక్కింది. అందుకు నేను చాలా గర్వంగా ఫీలవుతున్నాను. మళ్లీ ప్రీ రిలీజ్ ఈవెంట్లో కలుసుకుందాం .. అలాగే 29వ తేదీన థియేటర్లలో కలుసుకుందాం" అంటూ ముగించింది. ఇక ఇటీవలే రీతూ వర్మ 'టక్ జగదీశ్' సినిమాతో ప్రేక్షకులను పలకరించింది. ఆ సినిమాలో ఆమెకి మంచి రోల్ పడింది. ఆ సినిమాకి మిక్స్ టాక్ వచ్చినప్పటికీ ఆమె నటనకు మంచి మార్కులు పడ్డాయి. ఆ తరువాత సినిమాగా వస్తున్న 'వరుడు కావలెను'పై ఆమె గట్టిగానే ఆశలు పెట్టుకుంది. నదియా ఒక కీలకమైన పాత్రను పోషించగా మురళీశర్మ .. వెన్నెల కిషోర్ ముఖ్యమైన పాత్రల్లో కనిపించనున్నారు. తమన్ .. విశాల్ చంద్రశేఖర్ అందించిన బాణీలకు మంచి రెస్పాన్స్ వస్తోంది. ఆ తరువాత సినిమాగా ఆమె 'ఒకే ఒక జీవితం' చేస్తోంది. శర్వానంద్ కథానాయకుడిగా నటిస్తున్న ఈ సినిమాకి శ్రీకార్తీక్ దర్శకత్వం వహిస్తున్నాడు. వచ్చే ఏడాదిలో ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది.

## నేను గర్వంగా చెప్పుకునే సినిమా 'వరుడు కావలెను': నాగశౌర్య

నాగశౌర్య కథానాయకుడిగా 'వరుడు కావలెను' సినిమా రూపొందింది. లక్ష్మీసౌజన్య దర్శకత్వం వహించిన ఈ సినిమాలో నాగశౌర్య జోడీగా రీతూ వర్మ కనువిందు చేయనుంది. సూర్యదేవర నాగవంశీ నిర్మించిన ఈ సినిమాను ఈ నెల 29వ తేదీన థియేటర్లలో విడుదల చేయనున్నారు. ఈ నేపథ్యంలో ఈ సినిమా టైటిల్ కి తగినట్టుగా హైదరాబాద్ ఐటీసీ కోహినూర్ లో 'సంగీత్' పేరుతో ఈవెంట్ ను నిర్వహించారు. పూజ హెగ్డే ముఖ్య అతిథిగా ఈ వేడుక జరిగింది. ఈ సందర్భంగా నాగశౌర్య మాట్లాడాడు." చాలా మాట్లాడాలి .. ఎందుకంటే ఇప్పుడే ప్రమోషన్స్ మొదలుపెట్టాము. ఈ సినిమా ఒక రేంజ్ లో వచ్చింది. మన కుటుంబం గురించి చెప్పుకునేటప్పుడు మా కుటుంబం చాలా మంచిది అని ఎలాగైతే గర్వంగా చెప్పుకుంటామో. అలాగే మా సినిమా కూడా బాగా వచ్చిందని అంత గర్వంగా చెబుతున్నాను .. ఇది నా సినిమా. ఈ నెల 29వ తేదీన ఈ సినిమా విడుదలవుతోంది .. అందరూ కూడా థియేటర్లలో చూడండి. ఓటీటీలో వస్తుందని థియేటర్లలో చూడకుండా ఉండకండి. ఓటీటీలో రావడానికి ఇంకా చాలా సమయం పడుతుంది. 2018లో ఈ కథను వినడం జరిగింది .. 2019 చివరలో ఈ సినిమాను స్టార్ట్ చేశాము. 2021 ఎండింగ్ లో ఈ సినిమా మీ ముందుకు వస్తుంది. ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డాం .. ఫస్టువేవ్ .. సెకండ్ వేవ్ రెండూ చూశాము. ఈ మధ్యలో నిర్మాతలకు ఫోన్లు పగిలిపోయేలా ఓటీటీ ఆఫర్లు వచ్చే ఉంటాయి. ఈ సినిమా బాగా వస్తోందనే విషయం ఇండస్ట్రీలో అందరికీ తెలుసు. అయినా నిర్మాతలు ఆ సినిమాను అలా హోల్డ్ చేసి ఉంచారు. అలా చేయడం వల్లనే ఈ రోజున నేను ఈ స్టేజ్ పై గర్వంగా మాట్లాడుతున్నాను. అందువలన నిర్మాతలకు నేను థ్యాంక్స్ చెబుతున్నాను. లక్ష్మీ సౌజన్యగారు ఎన్నో ఏళ్లుగా అసిస్టెంట్ డైరెక్టర్ గా పనిచేస్తూ ఈ కథ రాసుకుని బాగా తీయాలని పోరాడింది. ఆమె కష్టం ఫలిస్తుందనీ .. ఈ సినిమా బ్లాక్ బస్టర్ హిట్ కొడుతుందని నేను నమ్ముతున్నాను. ఇక విశాల్ చంద్రశేఖర్ గొప్ప మ్యూజిక్ డైరెక్టర్ .. ఈ రోజున ఇన్ని వేదికలపై సందడి జరగడానికి కారణం ఆయన అందించిన పాటలు హిట్ కావడమే. ఆ గర్వంతోనే .. ఆనందంతోనే ఉన్నాము. సప్తగిరి నాకు ఏడెనిమిదేళ్లుగా తెలుసు .. ఆయనకి ఈ సినిమాలో మంచి




రోల్ పడింది .. చాలా అద్భుతంగా చేశాడు. సూర్యదేవర నాగవంశీ గారి విషయానికి వస్తే .. చాలా వండర్ఫుల్ వ్యక్తి. ఆయన ఎలాంటి లోపలు లేని మనిషి .. దగ్గరికి వెళ్లినా కొద్దీ ప్రేమ చూపిస్తూనే ఉంటారు. కథను నమ్మి డబ్బులు పెట్టే ఇలాంటి నిర్మాతల అవసరం ఇండస్ట్రీకి ఎప్పుడూ ఉంటుంది. ఇక చినబాబుగారు కూడా అంతే. నిజంగా ఒక పెళ్లి చేయాలంటే ఎంత కష్టపడాలో ఆయన ఈ సినిమాకి అంతగా కష్టపడ్డారు. రీతూ చాలామంచి నటి .. చాలా బాగా చేసింది. ఆమెతో మళ్లీ మళ్లీ సినిమాలు చేయాలని అనుకుంటున్నాను.

ఇక పూజ హెగ్డే ఈ ఫంక్షన్ కి గెస్టు అని నేను చెప్పలేను. నా కంటే ముందే ఈ బ్యానర్లో హిట్లు ఇచ్చేసి ఈ ఇంట్లో సెటిలైపోయారు .. ఒక ఫ్యామిలీ మెంబరులాగా. ఆమె ఈ సినిమా వేడుకలో పాలుపంచుకోవడం చాలా హ్యాపీగా ఉంది" అని చెప్పుకొచ్చాడు.

## ఎఫ్ 3 డేట్ లాక్.. సంక్రాంతిని మిస్సయ్యారుగా!




దసరా బరిలో మిస్సయినా సంక్రాంతి బరిలో వస్తుందనుకున్న ఎఫ్ 3 అప్పుడు కూడా రావడం లేదు. ఫిబ్రవరిలో తేదీని ఫిక్స్ చేసుకోవడం విశేషం. నిజానికి ఈ సినిమాని వందశాతం బౌండ్ స్క్రిప్టుతో సెట్స్ పైకి తీసుకెళ్లిన రావిపూడి నకాలంలో పూర్తి చేసేందుకు తనవంతుగా ప్రయత్నించారు. కానీ కరోనా మహమ్మారీ వెంబడించడంతో అది కాస్తా ఆలస్యమైంది. లాక్ డౌన్ లో వందశాతం స్క్రిప్టును రెడీ చేసుకుని వెంకటేష్ -వరుణ్ తేజ్ ల కాల్షీట్లను లాక్ చేసి షెడ్యూల్స్ ని కొనసాగించారు. ఎఫ్ 3 నిర్మాతలు దిల్ రాజు - శిరీష్ అవసరమైన అన్ని వనరులను సమకూర్చారు. తాజా సమాచారం మేరకు.. ఎఫ్ 3 విడుదల తేదీ లాక్ అయింది. ఈ సినిమా వచ్చే ఏడాది ఫిబ్రవరి 25న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఎఫ్ 3 వంటి ఫ్యామిలీ ఎంటర్టైనర్లు థియేటర్లలో ఎప్పుడు వచ్చినా మంచి రిజల్టును అందుకునేందుకు ఆస్కారం ఉందన్న నమ్మకం టీమ్ లో కనిపించింది. సీక్వెల్పై ఉన్న అంచనాలను అందుకోవడానికి ఎఫ్ 3లో ఫన్ గ్లామర్ డోస్ పెంచారు. ఉత్తరాది హాట్ గాళ్ సోనాల్ చౌహాన్ మూడో హీరోయిన్ గా నటిస్తుండగా తన పాత్ర ఎంతో ఆసక్తి కలిగిస్తుందని సోనాల్ చెబుతోంది. ఇందులో సునీల్ మరో కీలక పాత్రను పోషిస్తున్నారు. చాలా మంది నటులతో తెర నిండుగా కనిపించనుంది. ఎఫ్ 2ని మించి పదింతలు వినోదాన్ని అందిస్తామని రావిపూడి చెబుతున్నారు. అందుకు తగ్గట్టే సన్నివేశాల్ని మలుస్తున్నారని సమాచారం. రాక్స్టార్ దేవి శ్రీ ప్రసాద్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్ లో చిత్రీకరిస్తున్నారు. టోటల్ తారాగణంపై సన్నివేశాలు తెరకెక్కుతున్నాయని సమాచారం. సంక్రాంతి బరిలో తీవ్రమైన పోటీని దృష్టిలో పెట్టుకుని ఎఫ్ 3 రిలీజ్ ఫిబ్రవరి వరకూ వెళ్లింది. ఇకపోతే ఆర్.ఆర్.ఆర్ లాంటి భారీ పాన్ ఇండియా చిత్రంతో పాటు పలువురు అగ్ర హీరోల చిత్రాలు సంక్రాంతి బరిలో పోటీపడుతున్న సంగతి తెలిసినదే.

## బన్నీ నెక్స్ట్ ఏంటీ సస్పెన్స్ కంటిన్యూ



అల్లు అర్జున్ ప్రస్తుతం పుష్ప సినిమాలో నటిస్తున్నాడు. పుష్ప రెండు పార్ట్ లుగా ప్రేక్షకుల ముందుకు రాబోతున్న విషయం తెల్సిందే. అయితే మొదటి పార్ట్ కు మరియు రెండవ పార్ట్ కు మధ్య మరో సినిమాను బన్నీ చేసే అవకాశాలు ఉన్నాయని.. అది వేణు శ్రీరామ్ దర్శకత్వంలో ఐకాన్ అయ్యి ఉంటుంది అంటూ మొన్నటి వరకు మీడియాలో మరియు మెగా వర్గాల్లో టాక్ వినిపించింది. కాని ఇప్పుడు ఐకాన్ సినిమా ను బన్నీ చేసే ఉద్దేశ్యంలో ఉన్నాడా లేడా అనే చర్చ మొదలు అయ్యింది. ఇప్పటికే అధికారిక ప్రకటన వచ్చిన ఐకాన్ సినిమాను బన్నీ ఎప్పటికి మొదలు పెట్టబోతున్నాడు అనే విషయంలో క్లారిటీ ఇవ్వడం లేదు. పుష్ప పార్ట్ 1 ముగింపు దశకు వచ్చింది. కాని ఎక్కడ కూడా ఐకాన్ చర్చ కనిపించడం లేదు. బన్నీ సన్నిహితులు మరియు దిల్ రాజు కాంపౌండ్ కూడా ఐకాన్ గురించిన అధికారిక ప్రకటన ఏదీ చేయడం లేదు. ఈ సమయంలోనే బన్నీ తదుపరి సినిమా విషయంలో అల్లు అరవింద్ మరియు బన్నీ వాసులు స్పందిస్తూ బోయపాటి శ్రీను దర్శకత్వంలో సినిమా ఉంటుంది అంటూ చెప్పే ప్రయత్నం చేస్తున్నారు. గీతా ఆర్ట్స్ లో బోయపాటి శ్రీను దర్శకత్వంలో అల్లు అర్జున్ హీరోగా ఒక సినిమా పట్టాలెక్కబోతుందని బన్నీ వాసు అండ్ టీమ్ చెబుతున్నారు. భారీ అంచనాలున్న ఈ సినిమా ను వచ్చే ఏడాది ఆరంభంలోనే ప్రారంభించే అవకాశాలు ఉన్నాయంటూ మెగా వర్గాల్లో పుకార్లు షికార్లు చేస్తున్నాయి. ఇప్పటికే బన్నీతో సరైనోడు సినిమాను చేసిన బోయపాటి ఈసారి అంతకు మించి అన్నట్లుగా భారీ యాక్షన్ ఎంటర్ టైనర్ ను చేయబోతున్నట్లుగా అభిమానులు నమ్ముతున్నారు. బోయపాటి మరియు బన్నీల కాంబో కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. బోయపాటి సినిమా తర్వాత ఐకాన్ సినిమా ఉంటుందా అంటే అది కూడా నమ్మకం తక్కువే అన్నట్లుగా మెగా వర్గాల వారు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఎందుకంటే బన్నీ తదుపరి సినిమాల క్యూలో ప్రశాంత్ నీల్.. మురుగదాస్ తో పాటు మరో ప్రముఖ దర్శకుడు కూడా ఉన్నారు. కనుక ఐకాన్ సినిమా విషయం అనుమానమే అన్నట్లుగా ఇండస్ట్రీ వర్గాల వారు చెబుతున్నారు. రికార్డు బ్రేకింగ్ వసూళ్ల టార్గెట్ గా బన్నీ తన ప్రతి సినిమా పై కూడా చాలా ఎక్కువ శ్రద్ధ పెడుతున్నాడు. నాపేరు సూర్య సినిమా తర్వాత బన్నీ సినిమాల ఎంపిక చేసుకునే విధానం చాలా మార్పు వచ్చింది. అందుకే ఐకాన్ సినిమా విషయంలో కాస్త ఎక్కువగా ఆలోచిస్తున్నాడనే టాక్ ఇండస్ట్రీ వర్గాల్లో వినిపిస్తుంది. త్వరలోనే ఐకాన్ గురించిన ఒక నిర్ణయానికి బన్నీ వస్తే దర్శకుడు వేణు శ్రీరామ్ నెక్ట్స్ స్టెప్ తీసుకుంటాడు. అందుకే అభిమానులు బన్నీ నెక్ట్స్ ఏంటీ అంటూ ఇంకా కన్ఫ్యూజన్ లోనే ఉన్నారు.






Printed,Published & Owned by: Sajja Dhananjaya Sarath, Printing at : Unyted Publications, From H.no: #5+-61,-3, Rajendra Nagar, Seethampet, Visakhapatnam-16 ANDHRAPRADESH, India. Editor: Sajja Dhananjaya Sarath. RNI:APTEL/2008/25531,Permitted for posting under concession rates of postage, Postal Registration No. VJ/189/2017-19,Email.editor.prajapalana@gmail.com